

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

శుక్రవారం 4 ఏప్రిల్, 2025 | 8 పేజీలు

రిమ్స్‌లో రోగులకు అందిస్తున్న భోజన నాణ్యతపై ఆకస్మిక తనిఖీ

- ఫుడ్ సేఫ్టీ అధికారులు యండి.షంషీర్ ఖాన్, డా.ఎం.హరిత

విశాలాంధ్ర - కడప: కడప నగర శివార్లోని ప్రభుత్వ వైద్య శాల రిమ్స్ లోని రోగులకు అందిస్తున్న భోజన నాణ్యతను ఫుడ్ సేఫ్టీ అధికారులు యండి.షంషీర్ ఖాన్ మరియు డాక్టర్ ఎం.హరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు.రిమ్స్ ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న భోజనం ,పోషక విలువలు సమృద్ధిగా ఉందా లేదా అన్నది స్వయంగా పరీక్షించారు. రోగులతో మాట్లాడి అందుతున్న భోజనం గురించి వారి అభిప్రాయాలు తెలుసుకొన్నారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ కమిషన్ ఆఫ్ ది ఫుడ్ సేఫ్టీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్యశ్రీ ఆసుపత్రులు ,ప్రైవేట్ ఆసుపత్రుల్లో డైట్ కాంట్రాక్టర్లు అందిస్తున్న భోజనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు.భోజనం నాణ్యతలో ఎక్కడైనా లోపం కనబడితే తక్షణమే వాటిని స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ నాచారానికి పంపించి పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.తదుపరి పై తెలిపిన ఆసుపత్రి నందు ముడి పధర్థాల నాణ్యత కొరకు ల్యాబొరేటరీకి పంపించడం జరిగింది.తదుపరి పరీక్ష ఫలితాల ఆధారంగా డైట్ కాంట్రాక్టర్లకు తగిన సూచనలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైటిషన్ బాలాజీ నాయక్, డైట్ కాంట్రాక్టర్ ఖాజా పాల్గొన్నారు.

రైతాంగానికి రుణాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - రాయచోటి: రాష్ట్రంలో ఉద్యాన పంటలకు కూరగాయలు, పూలు, పండ్లు పంటలన్నింటికీ మద్దతు ధరలు నిర్ణయించి, మామిడి, అరటి, మిర్చి, జీడిమామిడి పంటలకు ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేసి అమ్మకాలు, కొనుగోళ్లు ప్రక్రియ బోర్డుల ద్వారానే నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కెవివి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ముఖ్య

2 లో

పేదలందరికీ ఇండ్లు, ఇంటి స్థలాలివ్వాలి

- ఈ నెల 7, 8, 9 తేదీలలో జరిగే రిలే నిరాహార దీక్షలు జయప్రదం చేయండి
- గాలి చంద్ర సిపిఐ జిల్లా కార్యదర్శి

విశాలాంధ్ర–యర్రగుంట్ల: ఇళ్ళు లేని పేదలకు అర్హులైన ప్రతి ఒక్కరికి పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇండ్ల స్థలం మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని ఈ నెల 7, 8, 9 తేదీలలో నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నియోజకవర్గ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఇండ్లు లేని పేదలకు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు కేటాయించాలన్నారు. ప్రభుత్వం టిడ్కో సంస్థ ద్వారా ఇండ్లు నిర్మాణం చేపట్టిన గత జగన్ ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు అందజేయలేదని ఇప్పటికైనా టిడ్కో ఇండ్లు లబ్ధిదారులకు అందజేసి ఇండ్లు లేని పేదలకు న్యాయం చేయాలన్నారు. ఇండ్లు ఇంటి స్థలాలు లేక చాలా మంది పేదలు బాడుగ ఇండ్లలో ఉంటున్నారని అర్హులను గుర్తించి ఇండ్లు ఇంటి స్థలం మంజూరు చేయాలని ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు ప్రభుత్వం చెల్లించాలని వారు కోరారు. ప్రభుత్వం పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు నిర్ణయించిందని

2 లో



విద్యుత్ శాఖలో మాయగాడు.!

- రూ.20లక్షల వరకు కరెంట్ బిల్లుల నగదు స్వాహా
- ఆన్లైన్ బెట్టింగ్ వ్యసనంతోనే నిర్వాకం
- విషయం బయటకు పొక్కడంతో జూనియర్ లైన్ మెన్ పరారీ

విశాలాంధ్ర-గాలివీడు: అతనో బాధ్యత కలిగిన విద్యుత్ శాఖలో జూనియర్ లైన్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వినియోగదారుల నుండి విద్యుత్ బిల్లులను వసూళ్లు చేసి నగదు కార్యాలయంలో లెక్కచెప్పాలి. అయితే ఇక్కడ కంచే చేను మేసిందన్న చందంగా వసూళ్ళ నగదు మొత్తాన్ని స్వాహా చేసి గుట్టు చప్పుడు కాకుండా ఉడాయించాడు. వివరాల్లోకి వెళితే గాలివీడు మండల కేంద్రంలో సచివాలయం జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న రామేశ్వర్‌రెడ్డి దాదాపుగా రూ. 20లక్షల వరకూ వినియోగదారుల వద్ద నుండి

2 లో

నా వద్ద కరెంట్ బిల్ కట్టడానికి రూ.2800 తీసున్నాడు..

నావద్ద కరెంట్ బిల్ కట్టాలని జూనియర్ లైన్మెన్ రామేశ్వర్ రెడ్డి రూ.2800 తీసుకున్నాడు కానీ కార్యాలయంలో జమ చెయ్యలేదు. దీంతో మరుసటి నెలలో బిల్ మొత్తం చెల్లించాలని సిబ్బంది నన్ను హెచ్చరించారు. అంతేగాక తన వ్యక్తిగత అవసరాల కోసం నా వద్ద అప్పుగా రూ. 20000 తీసుకున్నాడు. తిరిగి చెల్లించక పోగా ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు.

రామచంద్ర, ఎగువగొట్టివీడు

ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం..

జూనియర్ లైన్ మెన్ రామేశ్వర్ రెడ్డి గత నెల మార్చి 10 నుండి విధులకు హాజరు కాకపోవడంతో పరారీలో వున్నట్లుగా గుర్తించి ఇదే విషయమై జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాము. విద్యుత్ బిల్లులు వసూళ్ళు విషయం బాధితులు ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటాం.

విజయ్ కుమార్ రెడ్డి, ఏడీ, విద్యుత్ శాఖ.రాయచోటి

కడప రిమ్స్ ఒపీలో

అస్తవ్యస్తం

పర్యవేక్షణ నామ మాత్రం

2 లో

విశాలాంధ్ర-కడప: కడప జిజిహెచ్ (రిమ్స్) లో అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంది. ఇందుకు సంబంధిం చిన అధికారులు అక్కడ ఏం జరుగు తుంది? రోగులకు అవసరమైన సేవలు అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని గమ నించడం లేదు అనే విమర్శలు తలెత్తుతాయి .ఇలాంటి పరిస్థితుల్లో రోగులకు సరైన సేవ లు సౌకర్యాలు అందించడం లేదని అనుమానాలు వెల్లుతున్నాయి. గురువారం కడప

అనధికార లే అవుట్లపై చర్యలు తీసుకోవాలి

- అక్రమ లే అవుట్లలో ప్రభుత్వ సూచిక భోర్డులు ఏర్పాటు చేయాలి
- అక్రమంగా లే అవుట్లు వేసిన రియల్టర్లపై పోలీసు కేసులు నమోదు చేయాలి
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

2 లో

విశాలాంధ్ర - మదనపల్లి: వాల్మీకిపురం పంచాయతీ పరిసర పంచాయతీల లో ప్రభుత్వ నిబంధనలు భే ఖాతరు చేస్తూ అక్రమంగా అనధికారికంగా వేసిన లేఔట్లపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోపు కృష్ణప్ప డిమాండ్ చేశారు. వాల్మీకిపురం పంచాయతీ పరిధిలో అక్రమ లే అవుట్లను అధికారులు గుర్తించి ప్రభుత్వ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం డీఎల్‌పీవో కార్యాలయంలో ఏవో నాగరాజన్‌కు ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువలు, ప్రభుత్వ భూములు ఆక్రమించి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ దనార్జనే ద్యేయంగా వెంచర్లు ఏర్పాటు చేసిన రియల్టర్లపై పంచాయతీ అధికారులు పోలీసు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వాల్మీకిపురం పంచాయతీ సర్వే నంబర్ 130, 131, 129 పార్ట్, 121 పార్ట్‌లో వ్యవసాయ భూములు కన్వర్షన్ చేయకుండా,

కడపను డయేరియా రహిత జిల్లాగా మార్చాలి

- జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి
- ఏప్రిల్ 15 నుండి డయేరియా నియంత్రణపై జిల్లా వ్యాప్తంగా క్యాంపెయిన్

విశాలాంధ్ర -కడప: వైఎస్ఆర్ జిల్లాకు డయేరియా రహిత, ఆరోగ్యసహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులను జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి... ఏప్రిల్ 15నుండి డయేరియా (అతిసార) నియంత్రణ క్యాంపెన్ పై.. జిల్లా కలెక్టర్ డా.శ్రీదర్ చెరుకూరి జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ విస్తృతంగా చేపట్టి విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీతో.. నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి, గ్రామ స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఆరోగ్యం మరియు కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు మైక్రో ప్లాన్ అమలు చేయాలన్నారు. జిల్లాలో అతిసార కేసుల వ్యాప్తి అరికట్టేందుకు కమ్యూనికేషన్ స్ట్రాటజీ/ మానిటరింగ్ మెకానిజం అత్యంత ముఖ్యంగా అమలు చేయాలన్నారు. ఈ విషయమై వర్క్‌షాప్ నిర్వహించాలని, డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి.. ఆశా వర్కర్ల ద్వారా తక్కువ బరువున్న చిన్నారులకు జింక్ ప్యాకెట్లను అందించాలన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున ఐఈసి యాక్టివిటీలను చేపట్టాలన్నారు. అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లో పారిశుధ్య పరిరక్షణా చర్యలు చేపట్టేందుకు పబ్లిక్ హెల్త్, మున్సిపాలిటీ అధికారులు, గ్రామీణ నీటిసరఫరా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఆరోగ్య శాఖ సహకారంతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు

2 లో

విద్యుత్ శాఖలో 'మాయగాడు'..!

మొదటి పేజీ తరువాయి విద్యుత్ బిల్లులు వసూళ్లు చేసి నగదుతో ఉడాయించాడు. ఇతను ఇంటింటికీ వెళ్లి కరెంట్ బిల్లులు చెల్లించాలంటూ నగదు వసూలు చేసేవాడు. తీరా బిల్లు ఇవ్వమని అడిగితే బిల్ తీసే యంత్రం పనిచెయ్యడం లేదు మీ నగదు చెల్లిం పులు పూర్తయ్యాయి. కాబట్టి మీకు ఎలాంటి ఇబ్బంది వుండదంటూ నమ్మబలికే వాడు.సదరు జూనియర్ లైన్ మెన్ మాత్రం ఎంచక్కా ఆ నగదుతో ఆన్లైన్ బెట్టింగ్ లకు పాల్పడుతూ జల్సా చేసేవాడు.ఇదే క్రమంలో మూడు రోజుల క్రితం మండలకేంద్రంలోని చిలకలూరిపేటలో విద్యుత్ బకాయిలు చెల్లించలేదంటూ సిబ్బంది వినియో గదారుల ఇంటివద్దకు రావడంతో ఖంగుతిన్న బాధితులు మేము ఇదివరకే జూనియర్ లైన్మెన్ కు చెల్లించామంటూ వాపోయారు. ప్రస్తుతం సదరు ఉద్యోగి విధినిర్వహణలో లేడని, మీ బిల్లుల నగదు చెల్లింపులు జరగలేదని వెం టనే కరెంట్ బిల్ చెల్లించకపోతే కనెక్షన్లు తొలగిస్తామని సిబ్బంది హెచ్చరించడంతో వారిరువురి మధ్య వాగ్వి వాదం చోటుచేసుకుంది. దీంతో చేసేదేమీ లేక బాధి తులు లబోదిబోమంటున్నారు. గతంలో ఎగువగొట్టివీడు గ్రామంలో విధులు నిర్వహించిన సమయంలో కూడా ఆప్రాంతంలో పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడినట్లుగా సమాచారం. అంతేగాక పరిచయం ఉన్న వాళ్ళ దగ్గర పెద్ద మొత్తంలో అప్పుగా డబ్బులు తీసుకుని మోసం చేశా డంటూ పలువురు ఆరోపిస్తున్నారు. విద్యుత్ బకాయిల వసూళ్ళ నగదు మొత్తం చెడు వ్యసనాలతో ఆన్లైన్ బెట్టింగ్ లకు పాల్పడుతూ అప్పులపాలై అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పరారైనట్లు తోటి ఉద్యోగులు తెలిపారు. వెంటనే జిల్లాస్థాయి విద్యుత్ అధి కారులు విచారణ జరిపి సదరు ఉద్యోగిపై చట్టపరమైన చర్యలు తీసుకుని,కాజేసిన సొమ్ము రికవరీ చేసి బాధితులకు ఇప్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతాంగానికి రుణాలు ఇవ్వాలి

మొదటి పేజీ తరువాయి నాయకుల సమావేశం జరి గింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యాన పం టల సాగులో మేలైన నీటి యాజమాన్యం కొరకు నీటి కుంటలు విస్తారంగా త్రవ్వుకునేందుకు వీలు కల్పించా లని, రాబోయే వేసవి, వడగాల్పుల తీవ్రత దృష్ట్యా పం టలను బతికించుకునేం దుకు ట్యాంకర్లు, పైపులను వినియోగించి నీటి సరఫరాకు అవసరమైన నిధులు విడు దల చెయ్యాలి. పండించిన పంటలకు మద్దతు ధరలు లేవు. పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్లు, గోడౌ ను వసతులు మృగ్యం, ప్రాసెసింగ్ యూనిట్లు నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్య దర్శి వంగిమళ్ళ రంగారెడ్డి పాల్గొన్నారు.

పేదలందరికీ ఇండ్లు, ఇంటి స్థలాలివ్వాలి

మొదటి పేజీ తరువాయి అయితే కొన్ని షరతులు ఉన్నా యని అర్హులైన పేదలంద రికీ షరతులు లేకుండా ఇంటి స్థలం ఇల్లు మంజూరు చే యాలని వారు కోరారు. ఈ విషయంపై గత నెలలో అ న్ని మండల రెవెన్యూ, జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సిపిఐ ఆధ్వర్యంలో అందజేశామని అర్జీ లు అన్నింటినీ పరిశీలిం చి అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలం, ఇండ్లు మంజూ రు చేయాలని కోరుతూ ఈనెల 7, 8, 9 తేదీలలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నా మని అర్హులైన వారందరూ దీక్షలలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి ఎంవి సు బ్బారెడ్డి, సహాయ కార్యదర్శి ఎం. ప్రసాద్, నియోజకవర్గ కార్యవర్గసభ్యులు మనోహర్ బాబు, నాగేంద్రప్రసాదు, లక్ష్మీనారాయణ, మధు పాల్గొన్నారు.

కడపను డయేరియా రహిత జిల్లాగా మార్చాలి

మొదటి పేజీ తరువాయి అంగన్‌వాడీలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు/జింక్ కార్నర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. చిన్నా రుల్లో గ్రోత్ మానిటరింగ్ నిర్వహించడంపై అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇవ్వడం మరియు తక్కువ బరువున్న పిల్ల లకు పోషకాహారం అందించడం చేయాలన్నారు. ఎక్కడా అతిసార, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అనుబ ంధ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పక డ్బందీగా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం క్యాంపెయిన్ కు సంబంధించిన గాడ్ పత్రా లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో.. డిఎంహె చ్ఓ డా. నాగరాజు, ఇంచార్జ్ డిపివో ఖాదర్ బాషా, జీజీ హెచ్ సూపరింటెండెంట్ డా. రమాదేవి, ఎపిడమాలజిస్ట్ ఖాజా మోహిద్దీన్, ఐఎంఏ వైద్యులు, డిఆర్డీఏ, ఐసిడిఎస్, పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఆస్తులపై పెత్తనమేందుకు

విశాలాంధ్ర-రాయచోటి: ముస్లిం మైనార్టీల మనోభావా లను దెబ్బతీసే విధంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సవ రణ బిల్లు చట్టం తీసుకురావడం దారుణమని వైఎస్ ఆర్సిపి అన్నమయ్య జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షు డు వ్యాపారి మహమ్మద్ ఖాన్ అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ముస్లిం సోదరులు, కౌన్సిలర్లతో కలిసి ఆయన మీడి యా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి సంబంధం లేని ప్రయి వేటు ఆస్తులు తమ పూర్వీకులు అల్లా పేరుతో వక్ఫ్ దానం చేస్తే ఆ ఆస్తులను తమ గుప్పిట్లోకి తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. 2024 వక్ఫ్ అమెండ్మెంట్ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు ముస్లింలు అభద్రతాభావానికి లోన వుతున్నారన్న కారణంతో వైఎస్ఆర్సిపి పూర్తిస్థాయిలో వ్యతిరేకించిందని ఆయన గుర్తు చేశారు. జేపీసీకి సిఫా రసు, బిల్లు సవరణలు కాదని ఏకంగా బిల్లే వద్దని వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో ఎంపీ మిధున్ రెడ్డి నాడు నేడు, అలాగే రాజ్యసభలో సైతం వైఎస్సా ర్సీపీ వ్యతిరేకించిందని ఆయన చెప్పుకొచ్చారు. ముస్లిం లను నమ్మించి మోసం చేసిన టిడిపి, జనసేనలకు ముస్లింలు తప్పకుండా గుణపాఠం చెప్తారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి సమస్యను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకుపోయిన చైర్మన్

విశాలాంధ్ర రైల్వేకోడూరు: కడప రేణిగుంట జాతీయ రహదారి పనులు పూర్తి ప్రమాదాలను నివారించాలని కడప కుడ డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్ తెలుగుదేశం పార్టీ నియోజక వర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి, తనయులు విశాల్ రెడ్డి గురువారం న్యూఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, అన్నమయ్య జిల్లా బిజెపి అధ్యక్షులు సాయిలోకేష్ తో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ వైసిపి హయాం నుంచి కొత్త జాతీయ రహదారులను అమలు చేయలేదు,పాత జాతీయ రహదారులకు మరమ్మతులు చేపట్టలేదు, అందువలన చాలామంది ప్రాణాలు కోల్పో యారని ఆవేదన వ్యక్తం చేస్తూ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకుపో యామన్నారు. సానుకూలంగా స్పందిం చిన కేంద్ర మంత్రి కొత్త జాతీయ రహదారి నిర్మాణం పను లు త్వరగా చేపడతామని హామీ ఇచ్చారు.ముఖ్యంగా జాతీయ రహదారి నిర్మాణం కోసమే కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రిని కలవడానికి వేళ్లామని రూపా నందరెడ్డి పాత్రికేయులకు తెలిపారు.జాతీయ రహదారి పనులు చేపట్టే వరకు వదలి పెట్టను న్యూ ఢిల్లీలోనే కూర్చోని అయినా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ని, కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెంట బడి జాతీయ రహదారి పనులు చేపట్టి పూర్తి చేస్తామని రూపానందరెడ్డి పాత్రికేయులకు తెలిపారు.

ఇంటర్నేషనల్ ఆయుర్వేద కాన్ఫరెన్స్‌కు పెరుగు భవానిశంకర్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఈ నెల 9నుండి 11వ తేది వరకు తిరుపతిలోని ఎస్వీ యూనివర్సి టిలో జరగబోయే "ఇంటర్నేషన ల్ ఆయుర్వేద కాన్ఫరెన్స్" (ఐసీ టీఎంఎన్‌టి- 2025)కు సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జే.కా మాక్షమ్మ ఆహ్వానించినట్లు ఆయుర్వేద వైద్యుడు పెరు గు భవానిశంకర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో పేర్కొన్నారు. దశాబ్ద కాలంగా సంప్రదాయ వైద్య పరిరక్షణలో కృషి చేస్తున్న వైద్య పెరుగు భవానిశంకర్ సంప్రదాయ ఆయుర్వేద అవ గాహణ శిబిరాలు ఏర్పాటుచేసి ప్రజలలో ఈ వై ద్యం పట్ల చైతన్యం తీసుకొస్తూ మూలిక వైద్యం పట్ల అపో హాలు తొలగిస్తున్నారు. ఆయుర్వేదాన్ని అనుసరిం చట ం వలన ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లేని సంపూర్ణ ఆరో గ్యం సిద్దిస్తుందని తెలియజేస్తున్నారు. ప్రతి ఇంటి వం ట గదిలోని దినుసులతోనూ, మన పరిసరాలలో పెరిగే మూలికలను ఉపయోగించి చాలా రకాల వ్యాధులను నయం చేసుకునే గృహ వైద్యమును తెలియజేస్తూ ప్రజలలో సంప్రదాయ వైద్యంపై మక్కువను పెంచుతు న్నారు. అంతేకాక మనకు ఆరో గ్యాన్నిచ్చే నేల ఉసిరి, ఉత్తరేణి, తిప్పతీగ, పాషాణ భేది మొదలగు అమూల్యమైన మూలికలు పెరగుతున్నా యని, వాటి విలువ తెలుసు కోకుండా పిచ్చి మొక్కలుగా భావించి నిర్మూలిం చడం తగదని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అం దరి పైన ఉందని ప్రజలలో మూలికల పట్ల అవగాహణ కలిగిస్తున్నారు. ఇంటి ముందు తులసి మొక్క, గోమా తను పెంచడం మూలంగా రుగ్మతలకు దూరంగా ఉండవచ్చునని, ప్రపంచంలో మరెక్కడా లేని విజ్ఞాణం, సంప్రదాయాలు పేరుతో భారతీయ సంస్కృతిలో ఋ షులు నిక్షిప్తం చేసి మహోపకారం చేశారు. తాను అనేక వైద్య సేవ, అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరుస్తుందుకు ఇంటర్నే షనల్ ఆయుర్వేద కాన్ఫరెన్స్‌కు ఆహ్వానించారని పెరు గు భవాణిశంకర్ తెలిపారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రముఖ్ మారెళ్ల మల్లికార్జు నరావు, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

కడప రిమ్స్ ఒపీలో అస్తవ్యస్తం

మొదటి పేజీ తరువాయి

రిమ్స్‌లో చోటు చేసుకున్న విషయాలను పరిశీలిస్తే..కంటి విభాగం మహిళ ఓపి విభాగంలో 10:20 గంటల వుతున్నా డాక్టర్లు ఎవరు రాక పోవడం గమనార్హం. అదే విధంగా గురువారం కంటి విభాగం ఒపి లో సదరం క్యాంపు సర్టిఫికెట్ వేరికేషన్ కోసం చాలా మంది పేషంట్లు వచ్చారు. సదరం కోసం చాలా మంది పేషంట్లు, రోజువారి వైద్యం కోసం చాలా మంది పేషంట్లు వచ్చారు. అంతేకాదు గైనిక్ ఓపికి వెళ్లే దారిలో ఏర్పాటుచేసిన కుర్చీల సముదాయం విరిగిపోవడం గమనార్హం. అక్కడికి రోజు వారి చెకప్ కోసం ప్రెగ్నెన్సీ, గైనిక్ సంబందించిన పేషంట్లు దాదాపు వందల కొద్దీ వస్తారు. కాబట్టి ప్రెగ్నెన్సీ పేషంట్లు కూర్చోడానికి ఉన్న కుర్చీలు విరిగిపోయాయి. అయినా రిమ్స్ అధికారులు పట్టించి కోవడం లేదనే విమర్శలు విన వస్తున్నాయి.ఇలాంటి పరిస్తితుల దృష్ట్యా రిమ్స్ ఉన్నతాధికారులు. సరైన పర్యవేక్షణ ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

అనధికార లే అవుట్లపై చర్యలు తీసుకోవాలి

మొదటి పేజీ తరువాయి పంచాయతీకీ స్థలం ఇవ్వకుండా పంచాయతీ అప్రూ వల్ లేకుం డా అనధికారి కంగా వేసిన లే అవుట్లను అధికారులు విచారణ జరిపి రియల్టర్లపై చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. అ క్రమ లేవుట్లలో ప్రజలు స్థలాలు కొనుగోలు చేసి మోసపోవద్దని అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని లేని పక్షం లో ఏఐటీయూసీ, వ్యవసాయ కా ర్మిక సంఘం ఆధ్వర్యంలో ఆం దోళనలు చేపడతా మన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్, దేవా, వాసు తది తరులు పాల్గొన్నారు

డిఎంఎక్స్ ఐటీకి ఎంపికైన శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయ చోటి శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఇం జనీరింగ్, ఎంబీఏ చివరి సంవత్సరం చదువుతున్న విద్యా ర్థులు డిఎంఎక్స్ఐటి సర్వీస్ సంస్థ ప్రతినిధులు నిర్వహిం చిన ప్రాంగణ ఎంపికలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి ఎం పికయ్యారని శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వహించిన వివిధ దశల ఎంపిక ప్రక్రియలో ఇంజనీరింగ్ విభాగం నుండి 10మంది ఎంబీఏ విభాగం నుండి 5 మంది ఐటీ అసోసియేట్ ట్రైనీ హోదాకు ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన వారి కి 2.4లక్షల వార్షిక వేతనం అందుతుందని తెలియజే శారు. ఎంపికైన విద్యార్థులకు సంస్థ జనరల్ మేనేజర్ సిద్దేశ్వర్, కో ఫౌండర్ మహేశ్వర్ రెడ్డి ఉద్యోగ నియామక పత్రాలను విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.బాలాజీ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి కొత్తపల్లి ఇంతియాజ్, విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

వృద్ధులకు ఐదు లక్షల ఆరోగ్య భరోసా

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లా పరిధిలో 70 సంవత్సరాల పైబడిన వయో వృద్దులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంవత్సరానికి రూ 5లక్షల వరకు ఆరోగ్య భరోసా ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన వయో వందన కార్డు ద్వారా అందించడం జరుగుచున్నదని అన్నమయ్య జిల్లా డాక్టర్ ఎన్.టి.ఆర్ వైద్య సేవా ట్రస్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ తెలిపారు. అందరికి ఆరోగ్యం అనే లక్ష్య సాధన కోసం 2017 సంవత్సరము జాతీయ ఆరోగ్య విధానం సిపారసు మేరకు భారత ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జనఆరోగ్య యోజన పథకం ప్రారంభించడం జరిగింది (దారిద్య రేకకు దిగువన ఉన్న)సంవత్సరానికి 5లక్షల వరకు భీమా ఇవ్వడం జరిగింది. ఈ నేపథ్యంలో అన్నమయ్య జిల్లాలో 110298 నూతన ఆయుష్మాన్ భారత్ పిఎమ్ జేఏవై లబ్దిదారులను గుర్తించడం జరిగింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇప్పటికే ఏఎన్ఎమ్లు వారి వారి పరిధిలో ఉన్న 70సంవత్సరాల సీనియర్ సిటిజన్స్ ను గుర్తించి వారిని నమోదు చేసి ఇకేవైసి చేసి పిఎమ్ జేఏవై వయో వందన కార్డులు డౌన్లోడ్ చేయిస్తున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రజల ఆరోగ్యం కొరకు పెద్ద పీట వేస్తున్నారని ప్రజలు వారి సచివాలయం పరిధిలోని ఏఎన్ఎమ్ ను సంప్రదించి వయో వందన కార్డ్స్ పొంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వివాహ వేడుకలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక వై.వి.ఆర్ కళ్యాణ మండపంలో నంగనూరు పల్లె గ్రామానికి చెందిన బైరగాని చిన్న గుర్రప్ప యాదవ్ కుమార్తె వివాహ వేడుకలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పాల్గొని నూతన వధూవరూలను ఆశీర్వదించారు. నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో జీవించాలని అన్నారు. అనంతరం పలువురితో ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ బాదుబోయిన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భూములను కార్పోరేట్ శక్తులకు అప్పగించడమే బిజెపి పని

విశాలాంధ్ర-పులివెందుల: అమాయకుల భూములు లాక్కొని కార్పొరేట్ శక్తులకు అప్పగించడమే బిజెపి చేసే పని అని పులివెందుల కాంగ్రెస్‌పార్టీ నియోజ కవర్గ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉత్తర ప్రదేశ్‌లో నేరం నిరూపితం కాకుండానే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అమాయకుల ఇళ్లను కూల్చేస్తున్నా రన్నారు. మైనార్టీలు హాయిగా ఉన్నప్పుడే ఈ దేశమైనా పురోగతి దశలోకి పరిగెడుతుం దన్నారు. ఇది చరిత్ర చెబుతున్న సత్యమన్నారు. ఇప్పుడున్న వక్ఫ్ చట్టం వల్ల మొత్తం దేశమే ముస్లిముల చేతిలోకి వెళ్తుందని హిందువులను భయపెట్టి ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా చట్టం తెస్తున్నారని ధ్వజమెత్తారు. దీని ఫలితం బిజెపి కచ్చితంగా అనుభవిస్తుందన్నారు. ఈ చట్టానికి మద్దతు తెలిపిన ప్రాంతీయ పార్టీలు రేపు జవాబు దారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.

చీనీసాగులో రూపురేఖలు మార్చిన వ్యక్తి ఈఈ రాజశేఖర్

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల ప్రాంతంలో ఎండు దశలో ఉన్న చీనీసాగు రూపురేఖలను మార్చిన వ్యక్తి పిబిసి ఈఈ రాజశేఖర్ అని తుంగభద్ర హైలెవల్ కెనాల్ కమిటీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి కొనియాడారు. ఈఈ రాజశేఖర్ పదవీ విరమణ పురస్కరించుకుని జలవనరుల శాఖ అధికారులు చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసులుతో కలిని ఈఈని ఆయన గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లాడుతూ ఈఈ రాజశేఖర్ సేవలు వెలకట్టలేనివి ఆయన పదవి విరమణ చేస్తుంటే చాలా బాధగా ఉందన్నారు. పులివెందులలో చీనీ చెట్లు ఎండు దశలో ఉన్నప్పుడు పులివెందుల పీబీసీ ఈఈగా బాధ్యతలు చేపట్టి పులివెందుల రూపు రేఖలు మార్చారన్నారు. పులివెందుల ప్రాంతం నేడు సస్యశ్యామలమైందంటే అందుకు రాజశేఖర్ కృషి అన్నారు కృషి, పట్టుదలతొ రైతులకు అంకితభావంతో సేవలందించారని శ్లాఘించారు. ఆయన పదవి విరమణ పులివెందుల రైతాంగానికి తీరని లోటు అన్నారు. రాజశేఖర్ గారి సేవలను పులివెందుల రైతాంగం ఎప్పటికీ మర్చిపోరు ఆయన సేవలను నిత్యం పులివెందుల రైతాంగం గుర్తు చేసుకుంటూనే ఉంటారని తెలిపారు. పదవి విరమణ అనంతరం ఆయువు ఆరోగ్యాలతో ఆయన శేష జీవితం ఆనందంగా గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఆయ వెల్లడించారు. కార్యక్రమంలో జలవనరులశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

7నుంచి అడ్మిషన్లు ప్రారంభం

విశాలాంధ్ర-తొండూరు: తొండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 7వ తేదీ నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభిస్తామని ప్రిన్సిపల్ మురళీధర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి రాసిన విద్యార్థులు కూడా జూనియర్ కళాశాలలో సంప్రదించి దరఖాస్తులు పొందవచ్చన్నారు. ఈ ఏడాది మొదటి సంవత్సరం విద్యార్థులకు సిబిఎస్ఇ సిలబస్ ప్రకారం బోధన ఉంటుందన్నారు. ప్రస్తుతం రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు తమ జూనియర్ కళాశాలను సంప్రదించాలని ఆయన కోరారు.

బలపనూరులో ఫ్రైడే- డ్రైడేపై అవగాహన

విశాలాంధ్ర-పులివెందుల: సింహాద్రిపురం మండలం కోవరంగుట్టపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బలపనూరు గ్రామములో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో దోమల నివారణకు గురువారం సైఫోనోత్రిన్ పిచికారీ చేసి, ఇంటింటా ఫీవర్ సర్వే లార్వా సర్వే నిర్వహించి, ప్రజలకు దోమ కాటు వల్ల వచ్చు వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సిద్దయ్య మాట్లాడుతూ దోమ కాటు వలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధి, ఫైలేరియా వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఫ్రైడే- ఫ్రైడే పాటించుట వలన దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు. మన ఇంటి లోపల బయట నిల్వ ఉన్న నీటిలో దోమ గుడ్లు పెడతాయని, దోమ గుడ్ల నుండి లార్వా, లార్వా నుండి దోమగా మారుటకు పది రోజులు సమయం పడుతుందన్నారు. లార్వా దోమగా మారక ముందే ఏడవ రోజున నీరు నిల్వ ఉంచిన తొట్లు, బానలు, డ్రమ్ములు మొదలగు వాటి నుండి నీటిని పారబోసి వాటిని టెంకాయ పీచుతో బాగా శుభ్రపరిచి కడిగి ఆరబెట్టాలన్నారు. ఆ తరువాత నీటిని నింపుకొవాలన్నారు. మనం సాధారణంగా ప్రతి శుక్రవారం ఇంటిని శుభ్రపరచుకుంటాం అందులో భాగంగా పైన తెలిపిన విధంగా వారమునకు ఒకసారి తొట్లు, బానలు, డ్రమ్ములు మొదలగు వాటిని శుభ్రపరిచిన లార్వాదశలోనే దోమల్ని నాశనం చేయవచ్చును అని తెలిపారు. ఇది ఖర్చులేని విధానం సులభముగా చేసుకొనవచ్చున్నారు. ఎటువంటి రసాయనాలు వాడము కాబట్టి వాతావరణం కలుషితం ఉండదన్నారు. ఊరిలో అందరూ ఒకే రోజు డ్రైడే ని పాటించిన యెడల దోమల్ని సమర్థవంతంగా అరికట్టవచ్చని సిద్దయ్యతెలిపారు. కార్యక్రమములో హెల్త్ సూపర్ వైజర్ ఖలీల్ బాషా, ఆరోగ్య కార్యకర్త గంగా దేవి,ఆశా కార్యకర్తలు శివ కామేశ్వరీ, సుదేష్ణ, శైలజ మొదలగు వారు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

విశాలాంధ్ర-గాలివీడు: మండల కేంద్రంలో గురువారం కురిసిన వర్షానికి రహదారులన్నీ బురదమయమయ్యాయి. చినుకు పడటం వల్ల చిత్తడిగా మారిపోయాయి. ముఖ్యంగా బస్టాండ్ నుండి పెద్దూరుకు వెళ్లే మార్గంలో రోడ్డుపై మురుగునీరు నిలిచిపోయింది. దీంతో గ్రామస్థులు, వాహన చోదకులు నానా ఇబ్బందులు పడ్డారు. రహదారి మొత్తం రోతగా తయారైంది. కురిసింది మోస్తరు వానే గానీ రోడ్లన్నీ రొచ్చురొచ్చుగా తయారయ్యాయి. కాలువల్లో మురుగునీరు ప్రవహించక వీధులన్నీ కంపుకొడుతున్నాయి. ప్రజలు అడుగుతీసి అడుగు వేయాలంటే ఎక్కడ జారిపడతామోనని భయపడిపోతున్నారు. పారిశుధ్యం అధ్వానంగా మారడంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

సబ్ స్టేషన్ ప్రహరీ గోడ చుట్టూ ఆక్రమణలే..!

భూ ఆక్రమణలు పట్టీ పట్టనట్టు రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర - సుండుపల్లె: మండల కేంద్రంలోని నడిబొడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రహరీ గోడ చుట్టూ అనేక ఆక్రమణలు జరిగిన జరుగుతున్న పట్టినట్టు రెవెన్యూ అధికారులు, రహదారులు మరియు భవనాల అధికారులు, చోద్యం చూస్తున్నట్లు వ్యవహరించడం పై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన రెవిన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో శాశ్వతంగా ఇళ్ళను నిర్మించుకున్నట్లు నిర్మించుకుంటూ ఉంటే చోద్యం చూస్తున్నట్టు వ్యవహరించడం గమనరహం, ఒకరిని చూసి మరొకరు రాత్రికి రాత్రి కట్టుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు కోట్ల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను కాజేస్తున్న ఏమి తెలియనట్లు వ్యవహరించడం చూస్తుంటే రెవెన్యూ అధికారులకు జేబులు నింపినట్లు కొందరు మాట్లాడుకోవడం విశేషం, పట్టపగలే అక్రమంగా నిర్మిస్తున్న చూసి చూడనట్లు వ్యవహరించడం ఏంటి. మండల అధికారులకు గతంలో పలుమార్లు మండల పరిషత్ లో ఫిర్యాదులు చేసిన పట్టించుకో పోగా కొత్తగా ఆక్రమణ చేస్తున్న వారికి సపోర్ట్‌గా నిలవడం ఏమిటని మండల ప్రజలు వాపోతున్న వైనం, ఈ విధంగా పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు రోడ్డుపక్కన చేపడుతుంటే వాహనదారులకు ఎంతో ఇబ్బందికరంగా ఉన్న సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపై ఆంతర్యం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఆక్రమించి ఏకంగా రేకుల షెడ్లు వేస్తున్నా పట్టించుకోవడంలేదు, ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలను తొలగించి, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు, మండల తహసిల్దార్ దైవాధ్యానంను వివరణ కోరగా మా దృష్టికి వచ్చిన వెంటనే రెవిన్యూ అధికారులతో అక్రమ నిర్మాణాన్ని ఆపివేయడం జరిగిందని అలాగే ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణ పరిధిలోని టిడిపి కార్యాలయంలో గురువారం అసెంబ్లీ ఇన్చార్జ్ బీటెక్ రవి సతీమణి మారెడ్డి లతా రెడ్డి లబ్ధిదారులకు సిఎమ్ రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లతా రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. పేదల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ద్యేయమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భాగవత సప్తాహం ప్రారంభం

విశాలాంధ్ర-లింగాల: లింగాల పంచాయతీ పరిధిలోని ఎగువ లింగాల రామాలయంలో గురువారం భాగవత సప్తాహం కార్యక్రమం ప్రారంభమైంది. అనంత జిల్లా దంతెలపల్లి భాగవత సమాజం ఆధ్వర్యంలో దాతల సహకారాలతో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు ఈ సందర్భంగా కోరారు.

9వ తేదీ వరకు ఉచిత యోగా శిక్షణ

విశాలాంధ్ర-యర్రగుంట్ల: స్థానిక కడప రోడ్డు సాయినగర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా మందిర ప్రాంగణంలో కొనసాగుతున్న ఉచిత యోగా శిక్షణా తరగతులు ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5.30 నుండి 7.30 గంటల వరకు అలాగే సాయంత్రం 5 నుండి 7గంటల వరకు యోగాపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఒత్తిడి, బరువు తగ్గించుట, ఏకాగ్రత పెంచుట వంటి అంశాలపై యోగా ద్వారా అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

ఒంటిమిట్ట రైల్వే స్టేషన్‌లో అన్ని రైళ్లు ఆగేటట్లు చూడాలి: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: కడప జిల్లాలో చెన్నై - ముంబై రైలు మార్గం లో వున్న ఒంటిమిట్ట రైల్వే స్టేషన్ ను ఆధునీకరించి, అక్కడ అన్ని రైళ్లను అపాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట లో అతి పురాతనమైన శ్రీ కోదండ రామ స్వామి దేవాలయం ఉందన్నారు. అందువల్ల ఒంటిమిట్ట రెండవ అయోధ్యగా పేరు గాంచిందని తెలిపారు. ఒంటిమిట్ట ను ఆంధ్రా భద్రాచలం అని కూడా పిలుస్తారని, శ్రీరామ భక్తులు నిత్యం తండోపతండాలుగా తరలి వస్తుంటారన్నారు. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఒంటిమిట్ట లో శ్రీ రామ నవమి ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తోందన్నారు. ఈ దేవాలయం టిటిడి పరిధిలో ఉందని తెలిపారు. ఇక్కడ రైల్వే స్టేషన్ వున్నప్పటికీ రైళ్లు ఆగనందున భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి ఒంటిమిట్ట రైల్వే స్టేషన్ ను ఆధునీకరించి తిరుమల,వెంకటాద్రి,రాయలసీమ,గుంటూర్ ఎక్స్ప్రెస్ తదితర అన్ని రైళ్లు ఆగేటట్లు రైల్వే శాఖ,రాష్ట్ర ప్రభుత్వం, ఇతిడి హత్యలు తీసుకోవాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన గాలి నాణ్యత నివేదికలో 42 పాయింట్లతో కడప నగరం రాష్ట్రం లోనే అత్యంత క్లీన్ ఎయిర్ సిటీగా ఎంపిక కావడం హర్షణీయం, అభినందనీయం. 52పాయింట్లతో నెల్లూరు రెండవ స్థానంలో, 56పాయంట్లతో కర్నూల్, ఒంగోల్ 3వ స్థానంలో వుండగా, 120 పాయింట్లతో విశాఖ అట్టడుగున వుండడం గమనార్హం.

మైనార్టీలను మోసం చేయడంలో వైసిపి, టిడిపి దొందూదొందే: కాంగ్రెస్

విశాలాంధ్ర-వేంపల్లి: ముస్లిం మైనార్టీలను మోసం చేయడంలో వైసిపి, టిడిపి దొందూదొందేనని పెండ్లిమర్రి కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహబూబ్‌బాషా అలియాస్ మాస్ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం బిజెపితో జతకట్టి అన్యాయాలకు పాల్పడు తోందన్నారు. ప్రస్తుతం వక్ఫ్ బిల్లుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మద్దతు ప్రకటించడం, ఆ మేరకు విప్‌లు జారీచేయడం సిగ్గుచేటన్నారు. ముస్లింల ఆస్తులను కాలరాయడానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డ్ సవరణకు టిడిపి, జనసేన పార్టీల ఎంపీలు మద్దతు తెలిపేలా విప్‌లు జారీ చేశాయని తెలిపారు. ముస్లిం మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకుంటున్నారే తప్ప వారి అభివృద్ధికి తెలుగుదేశం, వైసీపీ, జనసేన పార్టీలు సహకరించలేదన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోవు రోజుల్లో ముస్లిం మైనార్టీలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఆ సమయం కూడా త్వరలోనే ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మరోమారు ఆలోచించి వక్ఫ్ బిల్లుపై పునరాలోచించుకోవాలని మాస్ వెల్లడించారు.

వేగవంతంగా పనులు చేపట్టండి: డిఎల్‌పిఓ విజయభాస్కర్

విశాలాంధ్ర- సిద్ధవటం: ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు దృష్టిలో పెట్టుకొని మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి జేఎంజే కాలేజీ సమీపం నుండి ఒంటిమిట్ట గ్రామం వరకు నేషనల్ హైవే రోడ్డు రహదారికి ఇరువైపులా ఉన్న ప్లాస్టిక్ వంటి పదార్థాలు పారిశుద్ధ్యాన్ని పూర్తిగా తొలగింపు ప్రక్రియ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పనులు జరుగుతున్న ప్రదేశాలను డిఎల్పిఓ విజయ భాస్కర్ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 వ తేదీ నుండి 15వ తేదీ వరకు జరిగే ఒంటిమిట్ట సీతారాముల బ్రహ్మోత్సవాలు దృష్టిలో పెట్టుకుని డిపిఓ రాజ్యలక్ష్మి ఆదేశాలతో సిద్ధవటం మండలంలోని జేఎంఏ కాలేజ్ సమీపం నుండి నేషనల్ హైవే రోడ్డు ఇరువైపులా ఉన్న ప్లాస్టిక్ వంటి పదార్థాలు పారిశుధ్యం, ముళ్ళ పొదలు పూర్తిగా తొలగిస్తున్నామని అందులో భాగంగా ఉప్పరపల్లి గ్రామం వరకు 30 మంది కూలీలు జెసిబి యంత్రాలతో పనులు చేపట్టామని ఇంకా రెండు రోజులు పనులు చేపడతామని అన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అపరిశుభ్రత లేకుండా పూర్తిగా తొలగింపు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు డిఎల్పిఓ రమణారెడ్డి గ్రామ పంచాయతీ సెక్రటరీలు రాజేష్, శివయ్య, రిహాన్, సంధ్యారాణి, విజయ్, లక్ష్మీనరసయ్య, సుజాత యాకోబ్, తదితర గ్రామపంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల ద్రోహి చంద్రబాబు: వైసిపి

విశాలాంధ్ర-పులివెందుల: ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లిం మైనా ర్టీల ద్రోహి అని వైసిపి నూర్‌బాషా సంఘం అధ్యక్షులు ఓతూరు రసూల్ తీవ్రస్థాయిలో విమర్శించారు. పులివెందులలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 50లక్షల మంది మైనార్టీల మనోభావాలను చంద్రబాబు దెబ్బతీశారన్నారు. మైనార్టీలను విస్మరిస్తే చంద్రబాబుకు పుట్టగతులుండవ్ అని హెచ్చరించారు. దివంగతనేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దేశంలోనే మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించిన ఏకైక నేత అన్నారు. ఆయన నతయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మైనార్టీలకు పూర్తిగా సహకరించి ఒక ఉప ముఖ్యమంత్రి దవి, నాలుగు ఎమ్మెల్యే స్థానాలను 4ఎమ్మెల్సీలను 9 రాష్ట్ర కార్పొరేట్ డైరెక్టర్లను నియమించారన్నారు. అంతేకాక నూర్‌బాషా సంఘానికి ఒక గుర్తింపు తెచ్చింది కూడా వైఎస్ కుటుంబ సభ్యులేన్నారు. అదే తరహాలో ఆయన తనయుడు వైఎస్ జగన్ కూడా నూర్ బాషా సంఘానికి కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేశారన్నారు ఒక మేయర్, రెండు కార్పొరేషన్ చైర్మన్లు, రెండు మున్సిపల్ చైర్మన్లు మా ర్కెట్‌యార్డు చైర్మన్ పదవులు ఇచ్చా రన్నారు. వక్ఫ్‌బోర్డు అనేది పూర్తిగా ధార్మిక, ముస్లిం సమాజానికి సంబంధించినదన్నారు. ప్రతి పక్షాలు వక్ఫ్ బోర్డు బిల్లు విషయంలో తాము సూచించిన సవరణను అంగీకరించాలని డిమాండ్ చేశారు. కానీ బిజెపి కూటమి ప్రభుత్వం అంగీకరించకుండా యావత్‌దేశ ముస్లిం సమాజానికి ద్రోహం చేసిందని తెలిపారు.ఇది ఆర్టికల్ 14ను ఉల్లంఘించమే అన్నారు. ఆర్టికల్ 26ను పూర్తిగా ఉల్లంఘించా్నారు. మోదీ ప్రధాని అయిన తర్వాత వక్ఫ్ ఆస్తులను తొలగింపు బిల్లును 2014 లోప్రవేశపెట్టి అప్పట్లో ఎందుకు విరమించు కున్నారో ముస్లిం మైనార్టీలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్ప టికైనా ముస్లింలకు న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం నడచు కోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైసిపి నూర్‌బాషా సంఘం తాలూకా అధ్యక్షుడు పకురుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన బండలాగుడు పోటీలు

విశాలాంధ్ర- మైలవరం: మండలంలోని వద్దిరాల గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ సుంకులాంబ పరంజ్యోతి అమ్మవారి తిరునాల మహోత్సవంలో భాగంగా 1వ తేదీ నుండి మూడవ తేదీ వరకు జరిగిన అఖిలభారత ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు గురువారం సాయంకాలం తో ఘనంగా ముగిశాయి. ఈ పోటీలలో మూడు విభాగాలుగా 6 పళ్ళు, న్యూ కేటగిరి, రెండు పళ్ళ విభాగాలకు సంబంధించి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి భారీ సంఖ్యలో పోటీలకు హాజరయ్యారు. అంతకు తగ్గట్టుగా వద్దిరాల కూటమినేతలు భారీగా ఏర్పాట్లు చేసి తిరుణాల మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్త చింతామణి నాటకం,కోలాటం, వేషధారణ, చెక్కభజన, సిరిమాను బండి మహోత్సవం వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ వద్దిరాల కూటమినేతలను అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ చదివిరాళ్ల నారాయణరెడ్డి పోటీలను ప్రారంభించారు.ఈ కార్యక్రమం లోయంకర్‌గా చిరంజీవి మరియు రవిచంద్రరెడ్డి,ఆడ్మిన్గా దాసరిక్రిష్ణ,లింగాల రేవంత్,గణి వ్యవహారించారు.ఈ కార్యక్రమం లో కూటమి నేతలు కూటమి నేతలు కూటమినేతలు మండల కన్వీనర్ చిన్న పాపిరెడ్డి క్లస్టర్ ఇంచార్జ్ రాజారెడ్డి, సూర్య పెద్దిరాజు యాదవ్, కొండయ్య యాదవ్, మాజీ సర్పంచ్ సింగన పల్లె చంద్రశేఖర్ రెడ్డి, రామ గోవింద యాదవ్, ఉపేంద్ర నాథ్ రెడ్డి, నీలికంటారెడ్డి,బాలరాజు యాదవ్, గురవయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ నరసింహులు యాదవ్ లచ్చన్న బాల హుస్సేన్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, గొల్లపల్లె భాస్కర్ రెడ్డి,పెద్ద పాపిరెడ్డి, మల్లెల రవీంద్రారెడ్డి, వెంకట కృష్ణయ్య గౌడ్ మొదలగువారు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన తెదేపా నేతలు

విశాలాంధ్ర- బ్రహ్మంగారిమఠం: మండల పరిధిలోని తోట్లపల్లి పంచాయతీ సమీపంలో ఉన్న పాపిరెడ్డి పల్లె పలుగురాళ్లపల్లి ప్రధాన రహదారి లో రోడ్డు కారు అదుపుతప్పి ప్రమాదం జరగడంతో కార్ల ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో వారిని గమనించిన తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, తెలుగుదేశం సీనియర్ నాయకులు యల్లటూరు, సాంబశివారెడ్డి టిడిపి యువ నాయకులు కానాల మల్లికార్జునరెడ్డి పూజ శివ యాదవ్ కలిసి ఇరుకు వంతెన వద్ద కారు అదుపుతప్పి దిమ్మెను ఢీకొట్టడంతో కారులో ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలు ఉన్నవారిని గమనించిన తెదేపా నాయకులు మానవత్వంతో వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు మానవత్వాన్ని చాటారు గాయపడిన వారి బంధువులు ఫోన్ల ద్వారా సమాచారం ఇవ్వడంతో వారిని అభినందించి ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అభినందించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు శివ శీను తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతులకు భారీ నష్టం.. కూలిన రేకుల ఇల్లు, అరటి చెట్లు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: నియోజకవర్గంలో గురువారం సాయంత్రం కురిసిన ఆకాల వర్షంతో, సుడిగాలులతో వ్యవసాయ రైతులు భారీగా నష్ట పోయారు. అనంతరాజుపేటలో పేదలకు చెందిన రేకుల ఇల్లు కూలిపోయి కట్టు బట్టలతో నిరాశ్రయులయ్యారని వైసిపి నాయకులు ఎంపిటిసి బండారు మల్లిఖార్జున తెలిపారు. రేకుల ఇల్లు, అరటి చెట్లు పడిపోయిన సమాచారం అందిన వెంటనే మల్లిఖార్జున హుటాహుటిన భాదితుల వద్దకు వెళ్లి ఓదార్చి మీకు మేము అండగా ఉంటాం అధైర్యపడవద్దు అని భరోసా ఇచ్చారు. శబ్దాలతో కూడిన ఉరుములు మెరుపులతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ స్తంబాలు కూలిపోయాయి, మరి కొన్ని ఒరిగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కె బుడుగుంటపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని అయ్యవారిపల్లి గొల్ల ఇండ్ల సమీపంలో ప్రధాన రహదారిపై కంప చెట్టు పడిపోయి రవాణాకు అంతరాయం ఏర్పడింది. సుడుగాలులు రైతులకు నష్టాలను మిగిల్చాయి. రైతులు ప్రతి సంవత్సరం భారీగా నష్టపోతున్నారు. ప్రభుత్వంలో చలనంలేదు. పడిపోయిన పండ్లతోటల నష్టాన్ని ప్రభుత్వ అధికారులు అంచనా వేయాల్సి ఉంది. పడిపోయిన పండ్ల తోటల రైతులను, కూలి రేకుల ఇల్లు భాదితులను ప్రభుత్వం తక్షణం స్పందించి ఆదుకోవాలని మల్లిఖార్జున డిమాండ్ చేశారు.

జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ముగిసిన పుట్టగొడుగుల పెంపకం



విశాలాంధ్ర- కలికిరి: జెఎన్‌టియు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఫుడ్ టెక్నాలజీ విభాగం మరియు ఆరన్ సైంటిఫిక్స్, మదనపల్లె ఆధ్వర్యంలో "మష్రూమ్ కల్టివేషన్ వర్క్‌షాప్" మార్చి 13వ తేదీ ప్రారంభమై ఆరు రోజులపాటు జరిగినది , ఏప్రిల్ 3వ తేదీ గురువారం ఈ ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే. త్యాగరాజన్, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్. విజయలక్ష్మి, ఆరన్ సైంటిఫిక్ ఫౌండర్ డాక్టర్ ఎన్. నందకిషోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ వర్క్ షాప్ ద్వారా విద్యార్థులకు మష్రూమ్ పెంపకం పై ప్రాక్టికల్ అవగాహన కల్పించగలిగాం అని వ్యవసాయ ఆధారిత పరిశ్రమల్లో శాస్త్రీయ విజ్ఞానం అనుసంధానించడం ఎంత అవసరమో, ఈ తరహా శిక్షణ ద్వారా అర్థమవుతుందని విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని స్వయం ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని అని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే. త్యాగరాజన్ మాట్లాడుతూ, మష్రూమ్ పెంపకం ద్వారా తక్కువ పెట్టుబడితో మంచి లాభాలను పొందవచ్చునని విద్యార్థులు ఈ శిక్షణ ద్వారా తగిన నైపుణ్యాలు నేర్చుకుని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని కళాశాల తరపున ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను మరింత ప్రోత్సహించేందుకు మేము కట్టుబడి ఉన్నాము అని తెలిపారు.

బలిజపల్లె గంగమ్మను దర్శించుకున్న టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి

విశాలాంధ్ర-రాజంపేట: కోరిన కోరి కలు తీర్చే కొంగు బంగారంగా రాజంపేట ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న బలిజపల్లి గంగమ్మ జాతర సందర్భంగా గురువారం రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు జాతర మహోత్సవంలో పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం టిడిపి నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో వైభవంగా ప్రతి సంవత్సరం ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు.గంగమ్మ కృప ఈ ప్రాంత ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని చమర్తి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు

విశాలాంధ్ర-రాయచోటి: మదనపల్లి పట్టణంలో 2017 సంవత్సరం అశోక్ హత్య కేసులో నింధితులు భాస్కర్, వెంకటేష్, కళ్యాణ్ లకు మదనపల్లె రెండవ కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి బి.అబ్రహం జీవిత ఖైదీలుగా, ఒక్కొక్కరికి 11వేల రూపాయలు జరిమానా విధించారు. 2017 సంవత్సరం ఆగస్టు 22వ తేదీ భాస్కర్ అశోక్ అక్రమ సంబంధం కలిగి ఉన్నాడని అనుమానంతో హత్య చేశారు. అప్పట్లో పోలీసులు కేసు విచారణ చేసి నిందితులను గుర్తించి సాక్షాదారాలతో కోర్టులో సమర్పించారు. సాక్షులను విచారించి నేరం రుజువు కావడంతో జీవిత ఖైదీలుగా శిక్ష విధించారు. కేసును పోలీసు అధికారులు పగడ్బందీగా నమోదు చేసి నిందితులను సాక్షులను ప్రవేశపెట్టి శిక్షలు పడే విధంగా కృషి చేయడం పట్ల జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీస్ అధికారులను పోలీసులను అభినందించారు. ఇలాంటి సంఘటనలకు పాల్పడే వారికి కోర్టు తీర్పు ఒక గుణపాఠం కావాలని ఎస్పీ పేర్కొన్నారు.

పీలేరు టిడిపి సర్వసభ్య సమావేశం విజయవంతం చేయండి

విశాలాంధ్ర- కలికిరి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గం శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి నివాసం నగిరిపల్లి లో ఈనెల 5వ తేదీ శనివారం పీలేరు నియోజకవర్గం తెలుగుదేశంపార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పీలేరు నియోజకవర్గం లోని పీలేరు, కలికిరి, వాయల్పాడు, గుర్రంకొండ, కలకడ, కేవీ పల్లి మండలపార్టీ అధ్యక్షులు, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యులు, పార్లమెంట్ పార్టీ కార్యవర్గ సభ్యులు, పీలేరు నియోజకవర్గం పార్టీ అనుబంధసంఘాల అధ్యక్షులు,క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, బూత్ కన్వీనర్లు, పార్టీ గ్రామం మరియు పట్టణ అధ్యక్షులు, పార్టీ అనుబంధసంఘాల అధ్యక్షులు,నల్లారి అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు

ముఖ్య అతిథులకు ఘన సన్మానం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: నియోజకవర్గ అసెంబ్లీ కేంద్రం కోడూరులో మాదిగ అభ్యుదయ సంక్షేమ సంఘం నూతన కార్యాలయం ప్రారంభం శుభ సందర్భంగా గురువారం ఉదయం నూతన కార్యాలయంలో ఎంఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొమరాల రాజశేఖర్ అధ్వర్యంలో తెలుగుదేశంపార్టీ నాయులు మాజీ ఎంపిటిసి శ్రీవేణుగోపాల్ స్వామి ఆలయ మాజీ చైర్మన్ బత్తిన ఆనంద్ యాదవ్ కు,వాటర్ ప్లాంట్ యాజమాని సయ్యద్ లాల్ భాషకు, విశాలాంధ్ర సీనియర్ పాత్రికేయులు వంకర సుబ్రమణ్యంకు శాలువా కప్పి పూలమాలవేసి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్ట్ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల రాధాకృష్ణ, ఎంఎస్ఎస్ మండలాధ్యక్షరాలు ఎద్దల బాలచంగమ్మ, సభ్యులు గంపల హేమంత్, బ్రహ్మణపల్లి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య

విశాలాంధ్ర- సుండుపల్లె: ప్రభుత్వ బడుల్లో విద్యార్థిని విద్యా ర్థులకు మెరుగైన విద్యను అందించడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారులు వెంకటేష్ నాయక్, రవీంద్ర నాయక్‌లు తెలిపారు గురువారం మండలంలోని రాయవరం తెలుగు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవం కార్యక్రమంలో వారు తెలియజేశారు. సొంత ఊరిలో విద్యావంతులైన ఉపా ధ్యాయులతో విద్యను అందించడం జరుగుతుందని, ప్రైవేటు బడులకు వెళ్లి వేలాది రూపాయలు డబ్బులు చెల్లించడం మానుకోవాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం బట్టలు పుస్తకాలను సైతం ప్రభుత్వం అందిస్తోంది అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షరీఫ్, ఆర్జెయుపి మండల అధ్యక్షుడు సిద్దు నాయక్, పిఆర్టియు మండల అధ్యక్షుడు నాగరాజు నాయక్, ఎస్‌టియు నాయకులు ఆరిఫుల్లా పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఎంపిడిఓ

విశాలాంధ్ర - సుండుపల్లె: మండల కేంద్రంలోని మండల డెవలప్మెంట్ అధికారితో పాటు అధికారులు సమయపాలన పాటించకపోవడంతో గురువారం 12 గంటలైనా ఎంపీడీవో రాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి దీంతో ప్రజలకు అసౌకర్యం కలిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు సమయానికి వచ్చి ప్రజల సమస్యలను గాలికి వదిలేసి తాము వచ్చినప్పుడే విధులు అన్నట్లుగా వ్యవహరించడం మండల ప్రజలకు ఇబ్బందికరంగా మారింది, ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమయానికి హాజరయ్యేలా చూడాలని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పథంలో ఒంటిమిట్ట మండలం

విశాలాంధ్ర- ఒంటిమిట్ట: మండలం లోని 13పంచాయతీల అభివృద్ధి కొరకు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి లోకేష్ లోకేష్ సారధ్యంలోఅన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు సహకారం మరియు ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి సహకారంతో అభివృద్ధి పదంలో ఒంటిమిట్ట మండలం నడుస్తోందని తెలుగుదేశం పార్టీ ఒంటిమిట్ట మండలాధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు పేర్కొన్నారు స్థానిక హరిత హెూటల్ లో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికీ పది నెలలు కావస్తున్న అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు ఒంటిమిట్ట మండలాన్ని ప్రత్యేక దృష్టితో శ్రీరామ ఎత్తిపోతల పథకం మరమ్మతులు చేయించి చెరువులో నీళ్ల కొరత లేకుండా రాబోయే రోజుల్లో చూస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు అదేవిధంగా "పల్లె పండుగ" భాగంగా ఒంటిమిట్ట మండలానికి 68 పనులు గాను 2 కోట్లకు పైగా నిధులు మంజూరు కావడంలో కృషి చేసినందుకు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజుకి, కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ కి ధన్యవాదాలు తెలిపారు. ఒంటిమిట్ట మండలాన్ని రాబోయే రోజుల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని చమర్తి జగన్ రాజు చెప్పారన్నారుఅదేవిధంగా కార్పొరేషన్ లోన్లు మరియు మినీ గోకులాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలకి పూర్తి సహకారం అందిస్తున్న జగన్మోహన్ రాజుకి, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి గారికి ఒంటిమిట్ట మండల ప్రజల తరఫున ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఒంటిమిట్ట మండలం ప్రజలకు ఏ సమస్య ఎదురైన మేమున్నాం అంటూ కల్పిస్తున్న చమర్తి జగన్మోహన్ రాజు భరోసా కల్పిస్తున్నారు అన్నారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గజ్జల నరసింహారెడ్డి ,మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బొబ్బిలి నాయుడు ,క్లస్టర్ ఇంచార్జి ఎస్.వి.రమణ ,బీసీ సెల్ రాజంపేట అసెంబ్లీ అధ్యక్షులు మినీగ వెంకటరమణ, హరినాథ రెడ్డి, చింత గింజల సుబ్రహ్మణ్యం, పత్తి సుబ్బరాయుడు, సర్పంచ్ లక్ష్మీ నరసయ్య, బుడిచెర్ల శ్రీనివాసులు, ఎంపీటీసీ సుంకేసుల భాష, కదిరే నాయుడు, మల్లికార్జున, కత్తి చంద్ర, శ్రీనివాసులు, ఐవారయ్య కత్తి, గొల్లపల్లి మాజీసర్పంచ్ నర్సింహులు, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసరాజు, గఫూర్, కనకరాజు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

"హరిద్రా ఘటనం"తో మొదలైన శ్రీ సీతారాముల కల్యాణోత్సవం

విశాలాంధ్ర - ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో గురువారం హరిద్రా ఘటనం - పసుపు దంచే సాంప్రదాయ కార్యక్రమం ప్రారంభమైంది హిందూ సనాతన ధర్మంలో, ఏదైనా శుభ కార్యక్రమం లేదా సాంప్రదాయ కార్యక్రమాలు పసుపు పొడి తయారీతో ప్రారంభమవుతుంది.ఆలయ అర్చకులు శ్రీ మనోజ్ స్వామి మాట్లాడుతూ, హరిద్రా ఘటనం సమయంలో తయారు చేసిన పసుపు పొడిని వార్షిక బ్రహ్మోత్సవాలలో అభిషేకం, కళ్యాణం, అక్షింతలు తయారీలోను, పలు శుభకార్యాల్లో ఉపయోగిస్తారన్నారు.వందలాది మంది మహిళా భక్తులు, శ్రీవారి సేవకులు రామనామ స్మరణతో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. టిటిడి మహిళా ఉద్యోగులు ఈ శుభ సందర్భంగా "సారె" సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్ బాబు, పిఆర్వో (ఎఫ్ఏసి) కుమారి నీలిమ, ఎస్వీబీసీ ఓఎస్డీ పద్మావతి అర్చకులు వీణా రాఘవాచార్యులు, ఇతరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాక్ ఫెస్టాలో ప్రతిభ కనపరచిన మిట్స్ విద్యార్థి

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి %డ% సైన్స్ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్) బి.టెక్ రెండవ సంవత్సరము చదువుతున్న విద్యార్థి సి.బాలాజీ పుత్తూరు సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి హ్యాక్ ఫెస్టా 2025 పోటీలలో ప్రతిభ కనపరచి రెండవ బహుమతిగా పదిహేనువేలు నగదు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. ఈ హ్యాకథాన్ లో విద్యార్థులు, స్టార్టప్ లు, టెక్నాలజీకి సంబంధించిన తమ సృజనాత్మకతను, సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రదర్శించే అవకాశాన్ని పొందారన్నారు . ముఖ్యంగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , మెషిన్ లెర్నింగ్ , ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్ వంటి అత్యాధునిక సాంకేతికతలపై చర్చలు, ప్రాజెక్టుల అభివృద్ధి, ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ టెక్నాలజీ నిపుణులు, పరిశ్రమ నాయకులు, శాస్త్రవేత్తలు హాజరై తమ అనుభవాలను పంచుకున్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డేటా సైన్సు విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ బి. భాస్కర్ సహాయ సహకారంతో ప్రతిభ కనపరిచిన బాలాజీ ని విభాగాధిపతి డాక్టర్ కుసుమ, కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ యన్. విజయ భాస్కర్ చౌదరి మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తదితరులు అభినందనలు తెలియజేసారు.

కులాలు, మతాలకు అతీతంగా చట్టం ముందు అందరూ సమానమే

- ఎస్.బి.అంజాద్ బాషా, మాజీ డిప్యూటీ సీఎం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందింది. ఈ అమెండ్‌మెంట్ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకంగా మేం భావిస్తు న్నామని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజాద్ భాష అన్నారు. ఈ మేం ˆకు గురువారం నగరంలోని ఉపముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నందు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులను కల్పించారన్నారు. కులాలు, మతాలకు అతీతంగా చట్టం ముందు అందరూ సమానమే అనేది రాజ్యాంగం చెబుతోందనియన్నారు. కు ల, మతాల ఆధారంగా వివక్ష ఎవరిపైనా చూపకూడదని రాజ్యాంగం చెబు తోందనీ తెలిపారు. అంతేకాదు.. రాజ్యాంగం ప్రకారం తమ మతాలను, ఆచారాలను పాటించ వచ్చని ఉంద న్నారు.మతపరమైన సంస్థలు నడుపుకో దానికి కూడా రాజ్యాంగం ఆర్టికల్ 26లో స్వేచ్ఛను కల్పించిందనీ తెలిపారు. అంతేకాదు.. ఆర్టికల్ 300 ప్రకారం నచ్చిన వారికి దానం చేసే హక్కును కల్పించారన్నారు. వీటన్నిటికీ ఈ వక్ఫ్ సవరణ బిల్లు వ్యతిరేకంగా ఉం ˆన్నారు. రాజ్యాంగ ఉల్లంఘన జరిగిందన్నారు. అందరూ సోదర భావంతో మెలగాలనే రాజ్యాంగంలో ఇన్ని హక్కులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించారనీ తెలిపారు. కానీ నేటి ఎన్డీయే ప్రభుత్వం వాటన్నిటికీ తూట్లు పొడుస్తూ మైనార్టీలకు అన్యాయం చేస్తూ బిల్లు పెట్టారనీ తెలిపారు. వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వానికి చెందుతాయని మైనార్టీ శాఖ మంత్రి కిరణ్ రిజుజు మాట్లాడం దారుణమన్నారు. రైల్వే, డిఫెన్స్ సంస్థలకు ఉన్న భూములు ప్రభుత్వం ఇచ్చిన భూములు కానీ.. వక్ఫ్ బోర్డులకు ఉన్న ఆస్తులు మన పూర్వీకులు కష్టార్జితంగా సంపాదించుకుని దానంగా ఇచ్చారన్నారు. దేశ వ్యాప్తంగా 8.75 లక్షల ఆస్తులు దేశవ్యాప్తంగా వక్ఫ్ బోర్డులకు ఉన్నాయి. వీటిని బీజేపీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనే కుట్రలో భాగంగా ఈ సవరణ బిల్లు తీసుకొచ్చారన్నారు. మీరంతా మైనార్టీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా ఎన్డీయే ప్రభుత్వం పరిగణిస్తోంది. నరేంద్ర మోడీ పదేళ్లుగా మైనార్టీల అభ్యున్నతి కోసం ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు మైనార్టీలను రాజకీయంగా సమాధి చేసేందుకే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు ఈ వక్ఫ్ చట్టాన్ని గతంలో ఎన్నో సార్లు సవరించినా మైనార్టీ మత పెద్దల మనోభావాలను దృష్టిలో పెట్టుకున్నారు. కానీ ఈ బిల్లులో మాత్రం కనీసం మైనార్టీల అభిప్రాయాలను తీసుకోకుండా సొంత ఎజెండాతో ఆమోదించారన్నారు జేపీసీ సభ్యులు కూ డా తమ నిర్ణయాలను, అభిప్రాయాలను కూడా తీసుకోలేదని ఏకపక్షంగా బిల్లు పెట్టారని చెబుతున్నారు. ఇదంతా మైనా ర్టీలపై కక్షసాదింపు చర్యల్లో భాగంగానే ఈ బిల్లును ప్రవేశపెట్టారు. మన రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు మాత్రం ఒక్క మైనా ర్టీకి కూడా మంత్రి వర్గంలో స్థానం ఇవ్వలేదు. ఈ ఆంధ్రరాష్ట్ర చరిత్రలో మైనార్టీ మంత్రి లేని ప్రభుత్వం చంద్రబాబు ఆధ్వర్యంలోనే నడిచింది. ఊసరవెల్లి కంటే ఎక్కువ రంగులు మార్చే నాయకుడు ఒక్క చంద్రబాబు మాత్రమే.పిల్లనిచ్చిన మామకే వెన్నుపోటు పొడిచిన ఆయన...మైనార్టీలకు వెన్నుపోటు పొడవడం పెద్ద విషయం కాదు. 2024లో మళ్లీ నువ్వు అధికారం కోసం అదే బీజేపీతో జతకట్టాడు.. చంద్రబాబు కేవలం తన స్వార్థం కోసం రాష్ట్రంలోని 50లక్షల మంది మైనార్టీ సోదరుల మనోభావాలను దెబ్బతీశాడు. మైనార్టీ పెద్దలు ఈ బిల్లును వ్యతిరేకించమని చంద్రబాబును ఎన్నో సార్లు కోరారు.వారిని నమ్మబలికాడు.. మొన్నటికి మొన్న ఇఫ్తార్ విందులో కూడా మైనార్టీలపై ఈగ కూడా వాలనివ్వనన్నాడు. వక్ఫ్ ఆస్తులను రక్షిస్తాను అన్న చంద్రబాబు రంగు మార్చి బిల్లుకు అను కూలంగా ఓటేశాడు. కూటమి ఎంపీలు తీరా చూస్తే ఈ చట్టాన్ని లోక్‌సభలో సమర్ధించారు. కూటమి ఎంపీలకు సిగ్గు శరం, చీము నెత్తురు ఉంటే మీ పదవులకు రాజీనామా చేయాలన్నారు.నేడు ముస్లిం సమాజం అణిచివేతకు గురవుతోంది. మీరు మీ నాయకుడిని ఒప్పించలేక పోయారన్నారు. అందుకే మీకు మీ పదవుల్లో ఉండే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చాక్లెట్ గౌస్, అలీ అక్బర్, షంషేర్, మహమ్మద్ షఫీ, అజ్మతుల్లా ఖాన్, నాయకులు చాంద్ బాషా, మాస్టర్ అహ్మద్, రాయల్ బాబు, అతావుల, ఇబ్రహీం మియా, ఎండి అబ్దుల్లా, అబ్దుల్ సుభాన్, సలీం సాహెబ్, అక్బర్ అలీ, సమీర్ తదితరులు ఉన్నారు.

కాలుష్యాన్ని నివారించుటకు మొక్కలు ఏర్పాటు

- కడప ఫారెస్ట్ రెంజ్ అధికారి ప్రసాద్

విశాలాంధ్ర - సిద్ధవటం: జేఎంజే కాలేజ్ సమీపాన రాజీవ్ శృతి వనంలో కడప ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్ పర్యవేక్షణలో కాలుష్యాన్ని నివారించుటకు నర్సరీలో మొక్కలు పెంపకం చేపట్టారు.మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి రాజీవ్ శృతి వనంలో కడప ఫారెస్ట్ రేంజ్ పరిధిలో కాలుష్యాన్ని నివారించుటకు వివిధ రకాల మొక్కలు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కడప ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్ గురువారం మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలచే మొక్కలు పెంపకం నర్సరీ పనులు చేపట్టామన్నారు. అందులో భాగంగా 5,20,000 లక్షల మొక్కలు పెంపకం చేపట్టామన్నారు.జూన్ మాసంలో మొక్కలు పంపిణీ చేపడతామని రైతుల పొలాల్లో సాగు చేసేందుకు రైతు సంబంధించిన భూహక్కు పాస్ బుక్ ఉన్నవారికి ఉచితంగా అందిస్తామన్నారు. ఇతరులకు అవసరమైతే ఆధార్ కార్డు సమర్పించి నర్సరీలో ఎర్రగన్నేరు, వేప, కానుగ, జామ, ఉసిరి, ఆకుపచ్చ చెట్లు, ఎర్రచందనం, నెమలి నారా, పనస, మామిడి, నేరేడు, మందారం తదితర మొక్కలు తీసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ కాలుష్య నివారణ అరికట్టేందుకు మొక్కలు సాగు చేయాలని ఆయన సూచించారు.

భూకబ్జాలు అరికట్టాలని వినతి

విశాలాంధ్ర-సిద్ధవటం: భూకజ్జాలు అరికట్టాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు దృష్టికి రాజంపేట నియోజకవర్గ బీసీ సెల్ కార్య నిర్వాహణ కార్యదర్శి పొట్ట శివ ప్రసాదు వినతి పత్రం సమర్పించారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో భూకజ్జాలు మితిమీరి పోతున్నాయని ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతాలు కాకుండా చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు దృష్టికి బుధవారం రాత్రి మంగళగిరి పార్టీ కార్యాలయంలో బీసీ సెల్ కార్య నిర్వాణ కార్యదర్శి శివప్రసాద్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పరపల్లి గ్రామంలో గత వైసిపి ప్రభుత్వంలో ప్రభుత్వ స్థలాలు దోచుకుని కూటమి ప్రభుత్వంలో కూడా ఉప్పరపల్లి గ్రామం భూ అన్యాక్రాంతాలకు ఉప్పరపల్లి గడ్డగా మారిందని వీటిపై చర్య తీసుకోవాలని ఆయన దృష్టికి తీసుకెళ్లి నట్లు గ్రామంలో సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు తెలియజేశారు.

చెట్టు కొమ్మలు విరిగిపడి వ్యక్తికి గాయాలు



విశాలాంధ్ర - గాలివీడు: మండల పరిధి రాయచోటి-గాలివీడు ప్రధాన రహదారి కరిమిరెడ్డి గారి పల్లె వద్ద గురువారం కురిసిన వర్షం ఈదురుగాలులతో చెట్టు కొమ్మలు విరిగి పడి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గోరాన్ చెరువు గ్రామం వడిశలంక వాండ్ల పల్లెకు చెందిన ఎమ్.చన్నకృష్ణా రెడ్డి వ్యవసాయ పనుల మీద మండలకేంద్రానికి వస్తున్న సమయంలో మార్గమధ్యంలో సంఘటన చోటుచేసుకుని వ్యక్తికి తలభాగం, ముక్కుపైన గాయాలతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. వెంటనే స్థానిక ప్రవేటు ఆసుపత్రిలో వైద్యం అందించారు.

ముస్లిం మైనార్టీలను బలహీన పరచడమే బిజెపి లక్ష్యం

- అందులో భాగమే వక్ఫ్ సవరణ బిల్లు

విశాలాంధ్ర-మదనపల్లె: భారతదేశంలో ముస్లిం మైనార్టీలను బలహీన పరచడమే బిజెపి లక్ష్యమని, అందులో భాగమే వక్ఫ్ సవరణ బిల్లును తీసుకొచ్చారని మదనపల్లె వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ ఆరోపించారు. గురువారం స్థానిక వైసిపి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ మనోభావాలను దెబ్బతీసే విధంగా, వారి ఆస్తులపై వారికి ఎలాంటి హక్కు లేకుండా చేసి కొల్లగొట్టడానికి ఈ వక్ఫ్ సవరణ బిల్లును తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. ఈ దేశం ముస్లిం మైనార్టీలకు హక్కేగానీ, ఛాయిస్ కాదనే విషయాన్ని బిజెపి ప్రభుత్వం గుర్తు పెట్టు కోవాలన్నారు. విభజించు పాలించు అన్న రీతిలో బిజెపి ప్రభుత్వం మైనార్టీ వర్గాలు, బలహీన వర్గాలపై విషం కక్కుతోందన్నారు. క్రమంగా ఒక్కో వర్గాన్ని అణిచివేసే దిశా సాగుతూ మొదటి వరుసలో ముస్లిం మైనార్టీలను దెబ్బ తీసే కుట్రలు పన్నుతోందన్నారు. ఇది భవిష్యత్తులో పెను ప్రమాదానికి సంకేతమన్నారు. ఎన్ డి ఏ కూటమిలో భాగమైన తెలుగుదేశం, జనసేన పార్టీలు ముస్లిం మైనార్టీలకు ఇంత అన్యాయం జరుగుతున్నా ఎండగట్టకపోవడం విచారకరమన్నారు. బిజెపి పెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ముస్లింల ద్రోహిగా మిగిలిపోతారని, ఇంకెప్పుడూ ముస్లింలు వారిని క్షమించరని తెలిపారు. వైసీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి లు ముస్లిం మైనార్టీలకు అండగా నిలిచి పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారని తెలిపారు. చంద్రబాబు నాయుడికి ఇప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే రాజ్యసభ లో ఆమోదం పొందనున్న వక్ఫ్ సవరణ బిల్లును అడ్డుకొని ముస్లింలకు అండగా నిలవాలన్నారు. లేదంటే చరిత్రహీనుడుగా నిలిచిపోతారని, భవిష్యత్తులో చంద్రబాబు నాయుడు ను ముస్లింలు నమ్మే పరిస్థితి ఉండదన్నారు. ఇప్పటికైనా తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలో ఉన్న ముస్లిం మైనార్టీ నాయకులు తమ అధికారాలకు రాజీనామాలు చేసి వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని, అప్పుడే ముస్లిం సమాజం వారికి అండగా నిలుస్తుందని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె ముస్లిం మైనార్టీ నాయకులు, ఏపీఎండీసీ మాజీ ఛైర్ పర్సన్ షమీమ్ అస్లామ్, ఖాజా, షబానా, ముబీన, రఫి, మాజీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ ఎస్ఏ కరీముల్లా, ముబషిర్ అహ్మద్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పరికరాలు పంపిణీ

విశాలాంధ్ర - జమ్మలమడుగు: స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జమ్మలమడుగు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు పరికరాలను పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం జమ్మలమడుగు పట్టణంలోని మాస్టర్ పాయింట్ వద్ద పరికరాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుండి పారిశుద్ధ కార్మికులకు పారిశుద్ధ్య పరికరాలను అందించలేదని తెలిపారు. ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఆదేశాల మేరకు శానిటేషన్ పరికరాలు అన్ని జమ్మలమడుగు పారిశుద్ధ్య కార్మికులకు అందించడం జరిగిందన్నారు. జమ్మలమడుగు పట్టణంలో 20 వార్డులకు పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్ కార్ట్ డస్ట్ బిన్లు 200, టూ ఇన్ వన్ స్ప్రేలు 09, ఫాగింగ్ మిషన్లు 02, పారలు, గడ్డపారలు, సమ్మెటలు, కొడవళ్ళు, సూత్తెలు, పికాసులు, డ్రమ్ములు తదితర పరికరాలు అందించమన్నారు. జమ్మలమడుగు పట్టణంలోని ప్రతి వార్డులో ఉన్న కాలువలు పరిశుభ్రంగా ఉంచేందుకు, పట్టణంలో చెత్త నిలువలు లేకుండా చూసేందుకు శానిటేషన్ పరికరాలను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

40కుటుంబాలు కూటమిలో చేరిక

విశాలాంధ్ర-యర్రగుంట్ల: మండలంలోని తుమ్మలపల్లె గ్రామానికి చెందిన సుమారు 40కుటుంబాలు వైసీపీని వీడి కూటమిలో చేరాయి. గురువారం వీరంతా దేవగుడి గ్రామానికి వెళ్లి టీడీపీ, బీజేపీ కండువాలు కప్పుకున్నాయి. స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, నియోజకవర్గ టీడీపీ బాధ్యులు భూపేష్‌రెడ్డిల సమక్షంలో కూటమి తీర్థం పుచ్చుకున్నాయి. వీరికి ఆయా పార్టీల కండువాలు వేసి ఎన్డీఏ కూటమిలోకి నేతలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆది, భూపేష్ మాట్లాడుతూ పాత, కొత్త శ్రేణుల కలయికతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఉద్బోదించారు. తాము కూడా అందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన గ్రామ ఉప సర్పంచ్ గోర్ల తులశమ్మ, మాజీ సర్పంచ్‌లు రామ మోహన్‌రెడ్డి, రామ ఓబుల్‌రెడ్డి, గోర్ల శీను, మునిరెడ్డి మాట్లాడుతూ ఆది, భూపేష్‌లు నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని చూసి ఆకర్షితులమై కూటమిలో చేరామని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన వారిలో మునిభాస్కర్, మురళీ, ప్రతాప్‌రెడ్డి, సోమిరెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, బ్రహ్మం రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి తదితర కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో మండల కూటమి పర్యవేక్షకులు తప్పెట్ల మధుసూదన్‌రెడ్డి, గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు బూచుపల్లి గంగాధర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవ్ ఎనర్జీ అండ్ సేవ్ ఎన్విరాన్‌మెంట్‌పై విద్యార్థుల ర్యాలీ

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: కడప మున్సిపల్ కార్పొరేషన్ కడప పట్టణం నందు ఎర్రముక్కపల్లి మున్సిపల్ కార్పొరేషన్ గాంధీనగర్ పాఠశాల సేవ్ ఎనర్జీ అండ్ సేవ్ ఎన్విరాన్మెంట్ ర్యాలీ కార్యక్రమాన్ని ప్రారంభించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఆశ్రీఫ్యాన్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు ఎలక్ట్రిషన్‌పై కిడ్స్ కాంపిటీషన్ డ్రాయింగ్ కాంపిటీషన్ వ్యాసరచన పోటీలు నిర్వహించబడింది. విద్యార్థినీ విద్యార్థులు ఉన్నటువంటి నైపుణ్యాన్ని వెలుపలకు తీయడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థిని విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేత అయినటువంటి వారికి బహుమతులు ప్రధానం చేయడం జరిగిందని తెలిపారు. ర్యాలీలో విద్యార్థులు సేవ్ ఎనర్జీ అండ్ సేవ్ ఎన్విరాన్మెంట్ కార్యక్రమానికి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఇంగ్లీష్ టీచర్ వి.శ్రీదేవి, కైలాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు నేతి బీరకాయలో నెయ్యి చూపిస్తున్న బిజెపి

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ మొహమ్మద్ ఫయాజ్

విశాలాంధ్ర - ఖాజీపేట: బిజెపి నేతృత్వంలో గల కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టినటువంటి వక్ఫ్ చట్ట సవరణ బిల్లును, ఒక్క ముస్లిం మైనారిటీకి కూడా ఎంపీ టికెట్ కేటాయించలేని భారతీయ జనతా పార్టీ ఈ చట్ట సవరణ బిల్లు ముస్లిం సమాజ ఎదుగుదలకు, వారి జీవితాలు బాగుపరచడం కోసమే అని చెప్పడం చూస్తే నేతి బీరకాయలో నెయ్యి ఎంత మాత్రం ఉంటుందో వారి మాటలలో గల సత్యము అంత మాత్రమేనని ఖాజీపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కడియాల మొహమ్మద్ ఫయాజ్ విమర్శించారు. ఇక ఎన్‌డిఏ కూటమిలో గల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేను ఆంధ్రప్రదేశ్లో ముస్లింలు నా సోదర సమానులు వారి మనోభావాలు దెబ్బతినే పని నేను చేయను అని చెబుతూనే ఈరోజు పార్లమెంటులో కేంద్ర ప్రభు త్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు తమ అం దరూ ఎంపీల మద్దతు తెలుపుడము చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఈ చర్యతో చంద్రబాబు నాయుడుకు

ము స్లిం మైనారిటీల పైన ఉండే ప్రేమ సవతి తల్లి ప్రేమే అని రుజువైందని ఆరోపించారు. కేవలం ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే దేశంలోని అన్ని మతాల వారికి కులాల వారికి సమానమైన గౌరవాన్ని ఇచ్చి మనల్ని భారతదేశాన్ని ఒక పెద్ద సెక్యులర్ దేశముగా ప్రపంచానికే తెలియజేసిందని ఇప్పటికైనా ప్రజలందరూ నిజాల్ని తెలుసుకొని కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాల్సింది గా ఖాజీపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డాక్టర్ కడియాల మొహమ్మద్ ఫయాజ్ ఒక ప్రకటనలో కోరారు.

చేతి పంపులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి

- సిపిఐ డిమాండ్

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: పోరుమామిళ్ల మండలంలో 17 పంచాయతీల్లో చేతిపంపు బోరింగులు చాలా వరకు రిపేర్లు చేయకపోవడం, నూతనంగా చేతిపంపు బోరింగ్ లకు ఉన్నతాధికారులకు మండల అభివృద్ధి అధికారులు చర్చించి ప్రజా అవసరాల కోసం ప్రతి పంచాయతీకి రెండు నూతన బోరింగులు చొప్పున 50 బోరింగులు మండలంలో అవసరం ఉన్నదని, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బృందంతో మండల అభివృద్ధి అధికారి ఏవో రమణయ్యకి వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్‌లు మాట్లాడుతూ గతంలో బోరింగ్ మెకానికల్ ద్వారా ఏ ఏ గ్రామాలలో రిపేరు ఉన్నది అని ఎప్పటికప్పుడు తెలుసుకొని మరమ్మతులు చేయించడం జరుగుతూ ఉండేది. కానీ ఇప్పుడు అలాంటివి ఏమీ లేకపోవడం వలన ప్రజలు నీటి సమస్య తీవ్రమైనది. ప్రధానంగా బూరగమానుపల్లె నుండి గానుగ పెంట వరకు స్మశానాల స్థలాల వద్ద, నిత్యం ప్రజలు ఉండే ప్రాంతాలలో చేతి పంపు బోరింగ్ లు ఉండేవి కానీ ఏ ఒక్క బోరు కూడా రిపేరు చేయకపోవడం, కొత్త బోర్ వేయకపోవడం వలన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మేకలకు, గొర్రెలకు, పశువులకు ఇబ్బంది లేకుండా గ్రామాలలో ఎక్కువగా , బీడు భూములు ఉండేవి. అందువలన ఎలాంటి ఇబ్బంది లేకుండా వుడేవి. అలాంటి పరిస్థితి ఇప్పుడు లేకుండా పోయింది. అందు వలన మండల అభివృద్ధి అధికారులు 17 పంచాయతీల్లో ఏ ఏ పంచాయతీల్లో అవసరమని గుర్తించి, నూతన బోర్లకు అనుమతులు తీసుకురావాలని, పాత బోరింగులు రిపేరి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యవర్గ సభ్యులు కేశవ, చెన్నయ్య, ఫిరోజ్,, వీరయ్య, నరసింహులు, ప్రసాద్ పాల్గొన్నారు.

గంగమ్మ జాతర భక్తులకు దాహార్తిని తీర్చేందుకే మజ్జిగ చలివేంద్రం

సేవా కార్యక్రమాలలో రాజంపేట ప్రెస్ క్లబ్ ముందంజ

విశాలాంధ్ర-రాజంపేట: భక్తుల దాహార్తిని తీర్చేందుకే మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని రాజంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భాస్కర్ అన్నారు. బలిజ పల్లె గంగమ్మ జాతరను పురస్కరించుకుని రాజంపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఆర్ఎస్ రోడ్డు లోని శ్రీ చైతన్య పాఠశాల వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బచోటి భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన బలిజ పల్లె గంగమ్మ జాతరకు జిల్లా నలుమూలల నుంచి అశేషంగా భక్తవాహిని పాల్గొంటారని, మందుటెండలకు భక్తుల దాహార్తిని తీర్చేందుకు చల్లని మజ్జిగతో పాటు జ్యూస్ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. అమ్మవారి కృపాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని, అమ్మవారి దయతో సకాలంలో వర్షాలు కురిసి నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు ఓబులేష్, ప్రధాన కార్యదర్శి మందా శివయ్య, కోశాధికారి సునీల్, కార్యనిర్వాహక కార్యదర్శులు చౌడవరం నరసింహ, శ్రీహరి, మధుసూ దన్, చిన్న, రవి, సభ్యులు దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి

విశాలాంధ్ర - రాయచోటి రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిసిసి అధ్యక్షుడు గాజుల భాస్కర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు నాయబ్ సయ్యద్ అలీ,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్ లు పార్టీ శ్రేణులతో కలిసి గురువారం డిసిసి కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఒక గంట శాంతి యుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, ప్రజల్లో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయని అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు వల్ల ముస్లిం సమాజానికి, మస్జీద్, మదరస, ఖబరస్తాన్ లకు, ముస్లిం సమాజం యొక్క మతపరమైన స్వేచ్ఛకు నష్టం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ప్రవేశ పెట్టి చేసిందని చెప్పారు, ఈ బిల్లు వల్ల ముస్లిం సామాజిక వర్గం తీవ్రంగా నష్టపోతుందని ఈ బిల్లును వెనక్కి తీసుకోకపోతే కాంగ్రెస్ పార్టీ తరుపున న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అలీ, చిన్నమండెం మండల అధ్యక్షుడు షబ్బీర్ ఖాన్, మాజీ పట్టణ అధ్యక్షుడు ఖాదర్ ఖాన్, ఇమ్రాన్, రియాజ్, అమీర్, జాబీర్, షేక్ అమీర్, కరీముల్లా, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - వల్లూరు: స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణపై వల్లూరులో గురువారం ఎర్రగుంట్లకు చెందిన పారిశుద్ధ కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. పారిశుధ్య కార్మికులకు ఘనవ్యర్థాలను ఏవిధంగా సేకరించాలి వాటిని ఎలా తరలించాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రంలో పారిశుద్ధ కార్మికులతో పరిశుభ్రత చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పోటీతత్వం పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-నందలూరు: స్థానిక నాగిరెడ్డి పల్లె జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం మండల స్థాయి విద్యారంగ పోటీలను నందలూరు మండల విద్యాశాఖాధికారి ఎల్. నాగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండే విద్యార్థులు విద్యారంగ పోటీల్లో పాల్గొని పోటీతత్వం పెంపొందించుకోవాలని కోరారు. నందలూరు హై స్కూల్ హెడ్ మాస్టర్ షేక్ రౌఫ్ బాష, నాగిరెడ్డిపల్లె హెడ్ మాస్టర్ జయలలిత కుమారి మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి ముందస్తు వేడుకల్లో భాగంగా యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం హర్షణీయం అని కొనియాడారు. యుటిఎఫ్ మండల నాయకులు ముక్కర హరినాథ్, కాకి రమేష్ జోషి, జి.కృపానందం, వి.సుధాకర్, కె ఆనంద్,ఆరెం చిన్న రెడ్డన్న మాట్లాడుతూ ఈ వ్యాసరచన, వకృత్వ పోటీలకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 50 మంది పాల్గొనడం అభినందించ దగ్గ అంశమని, దీనికి సహకరించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు జంగంశెట్టి చంద్ర కుమార్, పగడాల భరత్ కుమార్, సుబ్బలక్షుమ్మ, పిడి గౌరీ, పిఈటి జగన్, జూనియర్ అసిస్టెంట్ షాకీర్ హుస్సేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైయస్ షర్మిల రెడ్డిని కలిసిన సింగం శివ మోహన్ రెడ్డి

విశాలాంధ్ర - జమ్మలమడుగు: ఏపీసిసి రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డిని జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సింగం శివ మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం విజయవాడలోని ఆంధ్ర రత్న భవనంలో ఏపీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డిని పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సింగం శివ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పై నిరంతరం పోరాటం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

సంఘ సభ్యుల జీవనోపాధుల వార్షిక ప్రణాళిక తయారీపై శిక్షణ

విశాలాంధ్ర - పీలేరు: సంఘ సభ్యుల జీవనోపాధుల వార్షిక ప్రణాళిక తయారీ పై శిక్షణా కార్యక్రమం పీలేరు ఏపీఎం జవహర్ బాషా ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి స్వయం సహాయక సంఘం, సంఘ సభ్యుల జీవనోపాధులు ఏర్పాటు చేసుకొనుటకు, కుటుంబ అవసరాల కొరకు కావలసిన ఋణ ప్రణాళిక తయారిపై విఓఏలకు, ఎన్యుమరేటర్లకు సభ్యుల వారీగా వాస్తవిక అంచనాల ఆధారంగా వార్షిక ఋణ ప్రణాళికను తయారు చేయడం పై పీలేరు మండల మహిళా సమాఖ్య నందు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. గత 25 సంవత్సరాలుగా సంఘాల లోని మహిళలు వివిధ బ్యాంకుల నుండి బ్యాంకు లింకేజీ మరియు మండల సమాఖ్యలలో, గ్రామ సంఘాల నుండి స్త్రీనిధి, ఉన్నతి, ఋణాలని తీసుకొని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థి కంగా, సామాజికంగా బలోపేతం అవుతూ, సుస్థిర అభివృద్ధికి ఉపాధి, ఉద్యోగ అవకా శాలు పొందుతున్నారని అన్నారు., వచ్చే ఆర్థిక సంవత్సరము 2025-26 నకు సంఘ సభ్యులకు అవసరమైన సమయములో వారి జీవనోపాధులు ఏర్పా టుకు, కుటుంబ అవసరాలకు కావలసిన పెట్టుబడికి ఋణ, జీవనోపాధుల ప్రణాళిక తయారు చేయుటకు మొబైల్ యాప్‌ను ఇవ్వడం జరిగినదని తెలిపారు.

యథేచ్ఛగా ఎస్సీ, ఎస్టీ భూములు కబ్జా

విశాలాంధ్ర - పీలేరు: పీలేరు మండలంలో నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీల భూములు యదేచ్ఛగా కబ్జాల కు గురయ్యాయని మాలమహా నాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ ధ్వజమెత్తారు నేడు పీలేరు మాలమహానాడు కార్యాలయంలో మండల యూత్ ప్రెసిడెంట్ జెట్టి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో హీనజాతుల కింద ప్రభుత్వం భూమి ఇచ్చింది భూ బకాసురులైన అగ్రకుల పెత్తందారులు ఎ రాజకీయ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీనీ అడ్డుపెట్టకొని అప్పుడు ఇప్పుడు ఎప్పుడైనా వారు ఆక్రమించేది ఎస్సీ, ఎస్టీ భూములు ఆక్రమించుకొని వారిని ఆ భూమిలోకి అడుగు పెట్టనీయకుండా అగ్రకులాల పెత్తందారులు అడ్డుకుంటే అంగబలం,ఆర్థికబలం,రాజకీయ బలం లేని ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగంలోని చట్టాలను అమలుచేయడంలో ఇంతవరకు ఎ ప్రభుత్వం పురోగతి సాధించలేదు హక్కుదారులైన ఎస్సీ, ఎస్టీలకు ఆ భూమిని అప్పగించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్న రాజకీయ ప్రలోభాలకు తలొగ్గి అగ్రకులాల పెత్తందారులకు సహాయ సహకారాలు అందిస్తున్న నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీల పేరుతో బోగస్ పట్టాలు పొంది ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేసిన భూముల్లోకి వారిని రానీయకుండా ఎవరు అడ్డుకున్న అట్రాసిటీ కేసు నమోదు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉన్న అడ్డుకోకుండా చూస్తూ ఉండే అధికారులు ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత పోలీసు రెవెన్యూ అధికారులపై ఉన్న వారు ఉండి ఉపయోగం లేదని అసహనం వ్యక్తం చేశారు పీలేరు మండలంలో యదేచ్ఛగా ఎస్సీ భూములు కబ్జాలకు పాల్పడుతున్నారని అధికారులకు ఎస్సీలు ఎన్నిసార్లు విన్నవించినా చర్యలు తీసుకోకపోవడంతో ఎస్సీ గ్రామాలలో ఘర్షణలు తలెత్తుతున్నాయి ప్రభుత్వ రికార్డులలో ఎస్సీ భూములని తెలిసిన కొందరు రాజకీయ నాయకుల అండదండలతో దౌర్జన్యంగా ఎటువంటి రికార్డులు లేకుండా ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు ప్రభుత్వ రికార్డుల్లో ఎస్సీ భూములని తెలిస్తే వెంటనే రికార్డులలో ప్రభుత్వ భూములుగా మార్చి బోగస్ పట్టాలు పొంది వాణిజ్య వ్యాపార సముదాయాలు ఇండ్ల నిర్మాణం చేపట్టారని పలుమార్లు రెవెన్యూ అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో ఎస్సీలకు ఆక్రమితదారులకు పలుమార్లు ఘర్షణ వాతావరణం నెలకొన్న పరిస్థితులు పీలేరు మండలం ఎర్రగుంటపల్లి గ్రామపంచాయతీ రేగళ్ల గ్రామపంచాయతీ ఇలా అనేక గ్రామపంచాయతీలలో యదేచ్ఛగా ఎస్సీ భూములను కబ్జాలకు పాల్పడుతున్నారు కబ్జాలకు పాల్పడుతున్న వారిపై జాతీయ ఎస్సీ కమిషన్ పూర్తి ఆధారాలతో మాలమహానాడు ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయబడునని తెలిపారు కార్యక్రమంలో మాలమహానాడు కార్యవర్గ సభ్యులు గంగారపు వెంకటేష్, గంగారపు గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సిఎన్ఆర్ కళాశాలలో జాబ్ మేళా

- జాబ్ మేళాలో 29 మంది ఎంపిక



విశాలాంధ్ర - పీలేరు: పీలేరులోని సిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో మద్రాసుకు చెందిన ఏ ఆర్ కె హెచ్ ఆర్ సొల్యూషన్స్ అండ్ సర్వీసెస్ గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 48 మంది పాల్గొనగా వివిధ దశలలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో 29మంది ఎంపికైనట్లు సిఎన్ఆర్ కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ఎన్నికైన అభ్యర్థులకు హెచ్ ఆర్ మేనేజర్ కుసుమ మరియు సురేష్ కుమార్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఎంపికైన అభ్యర్థులకు రెండు లక్షల వార్షిక వేతనం అందుతుంది. ఈ కార్యక్రమంలో సిఎన్ఆర్ కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య, అధ్యాపకులు పాల్గొని ఉద్యోగాలకు ఎన్నికైన అభ్యర్థులను అభినందించారు.

మసీదులకు దానం చేసిన ఆస్తులను కార్పొరేట్లకు అప్పగించడానికే కొత్త వక్ఫ్ చట్టం

- భారతీయ అంబేద్కర్ సేన విమర్శ

విశాలాంధ్ర - మదనపల్లి: భారతదేశంలో సాయుధ దళాలు, రైల్వేల తర్వాత వక్ఫ్ బోర్డులు మూడో అతి పెద్ద భూ యాజమానులుగా ఉన్నాయని, దేశంలో తొమ్మిది లక్షల నలభై వేల ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుల వద్ద ఉందని, మసీదులకు దానంగా వచ్చిన ఈ విలువైన ఆస్తులను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకే, బిజెపి ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్టానికి సవరణలు చేసి కొత్త చట్టం తీసుకొచ్చిందని భారతీయ అంబేద్కర్ సేన (బాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీయం శివప్రసాద్ విమర్శించారు. చట్టం పేరును కూడా మార్చేసి, "యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్మెంట్, ఎంపవర్మెంట్, ఎఫిషియన్సీ అండ్ డెవలప్మెంట్" అని కొత్త పేరు పెట్టారని ఎద్దేవా చేశారు. కొత్త వక్ఫ్ చట్టంలో ప్రతిపాదిత సవరణలు చాలా పెద్ద చర్చకు దారితీశాయని, పార్లమెంటరీ జాయింట్ కమిటీ కూడా ఈ బిల్లు మీద చర్చలు జరిపి కొన్ని సవరణలు ప్రతిపాదించిందని, అయితే, పార్లమెంటు సభ్యులకు సవరణలు ప్రతిపాదించే అవకాశం లేకుండా బిల్లు ప్రతులను చివరి నిమిషంలో పంపిణీ చేసి మమ అనిపించరని చెప్పారు. పాలక పక్షం ఈ బిల్లును సమర్థించుకోవడానికి అనేక అపద్దాలను ప్రచారం చేస్తోందని, వక్ఫ్ భూములను రక్షించడం, అన్యాక్రాంతం కాకుండా నివారించే లక్ష్యంతో ఈ చట్టం తెచ్చినట్టు చెబుతున్నారని, ఇందులో ఏమాత్రం నిజం లేదని అన్నారు. కొత్త వక్ఫ్ చట్టంలో బోర్డు సభ్యులుగా ముస్లిమేతరులను నియమించే ప్రొవిజన్నును పొందుపరిచారని, ఇది అభ్యంతరకరమైన విషయమని చెప్పారు. అదే విధంగా వక్ఫ్ భూములంటే మసీదుల నిర్వహణ కోసం, ముస్లింలు దానం చేసిన భూములు అని అర్థం. అవి దేవుని మాన్యాలని అర్థం. వాటిని అమ్మే అధికారంగానీ, మరొకరికి బదలాయించే అధికారం గానీ ఆయా మసీదులకు వుండదు. ఒక్కసారి వక్ఫ్‌కు దానం చేసిన భూముల మీద దానకర్తలకు కూడా ఎలాంటి యాజమాన్య హక్కులుండవని శివప్రసాద్ చెప్పుకొచ్చారు. ముస్లిం సమాజానికి అత్యంత ద్రోహం చేసే ఈ కొత్త వక్ఫ్ చట్టానికి తెదేపా, జనసేన పార్టీలు మద్దతు ఇవ్వడం అత్యంత నీతిమాలిన చర్య అని శివప్రసాద్ దుయ్యబట్టారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక బాస్ కార్యాలయం నుండి పత్రికా ప్రకటన విడుదల చేశారు.

రైతు వెంకటాద్రి ఆత్మహత్య కారకులైన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలి

- రైతు కుటుంబానికి న్యాయం చేయాలి
- సీపీఐ నాయకులు డిమాండ్

విశాలాంధ్ర - పీలేరు: వాల్మీకీపురం మండలం పెదవాకపల్లికి చెందిన రైతు వెంకటాద్రి ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపి వెంకటాద్రి మృతికి కారకులైన వారిపై పోలీసులు కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో కఠినంగా శిక్షలు పడేలా పోలీసులు చూడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు సాంబశివ కృష్ణప్ప డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటాద్రి కి చెందిన భూమిని ఆక్రమణ చేశారని రెవెన్యూ అధికారులు న్యాయం చేయాలని తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి నా న్యాయం జరగలేదని ఆత్మహత్యకు వెంకటాద్రి పాల్పడ్డాడని రెవెన్యూ ఉన్నతాధికారులు రైతు వెంకటాద్రి భూమిని ఆక్రమణ పై సమగ్ర విచారణ జరిపి మృతి చెందిన వెంకటాద్రి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. భూమిని ఆక్రమణ దారుల నుంచి వారి కుటుంబ సభ్యులకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన రైతు వెంకటాద్రి కుటుం బాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగ భూ సమ స్యలు సత్వరం పరిష్కారం చేయడానికి అధికారులు కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సీపీఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్ వెంకటేష్, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్, దేవా, వాసు తదితరులు పాల్గొన్నారు.

40కుటుంబాలు వైసీపీ నుండి ఎన్డిఏ కూటమిలో చేరిక

విశాలాంధ్ర - జమ్మలమడుగు: ఎర్రగుంట్ల మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి ఎన్డీఏ కూటమిలోకి కండువా కప్పి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ భూపేష్ రెడ్డిలు సాదరంగా ఆహ్వానించారు. గురువారం జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంలోని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి స్వగృహము నందు కూటమి పార్టీలోకి చేరిక కార్యక్రమం నిర్వహించారు. ఎర్రగుంట్ల మండలం తుమ్మలపల్లి గ్రామ ఉపసర్పంచ్ గొర్ల తులసమ్మ భర్త వెంకట రమణయ్య, మాజీ సర్పంచ్ కుడుములు రామ మోహన్ రెడ్డి, ఎర్రపల్లి రామ ఓబుల్ రెడ్డి, గొర్ల శీను, కుడుములు మునిరెడ్డి, ముని భాస్కర్, మురళి ప్రతాపరెడ్డి,సోమిరెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి ,బ్రహ్మం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు కూటమిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ భూపేష్ రెడ్డి జమ్మలమడుగు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు తాము ఆకర్షితులమై వైసిపి పార్టీని వీడి కూటమి పార్టీలో చేరమన్నారు.ఈ కార్యక్రమంలో ఎర్రగుంట్ల ఎన్డీఏ కూటమి మండల ఇంచార్జ్ మధుసూదన్ రెడ్డి, గ్రామ నాయకులు గంగాధర్ రెడ్డి, సురేంద్రారెడ్డి, వెంకట శివారెడ్డి, సునీల్, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని లక్కిరెడ్డిపల్లి పంచాయతీలో 17వ నంబరు బూతుకు సంబంధించి టీడీపీ సభ్యత నమోదు కార్డులను రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి, బూత ఇంచార్జ్ ఎస్ఎండి షఫీ నాయక్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యకర్తలకు అండగా చేపట్టిన ఐదు లక్షల ప్రమాద బీమా సభ్యత్వ కార్డులను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు 17వ బూతులోని కార్యకర్తలకు, తాసిల్దార్ కార్యాలయానికి వెనుక వీధిలోని కార్యకర్తలకు టిడిపి సభ్యత నమోదు కార్డులను పంపిణీ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత కార్డు తీసుకున్న వారికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు కొలిమి పకీరయ్య, యలమంద రవీంద్ర, బషీర్ అహ్మద్, చంద్ర, మస్తాన్ వలి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జ్ మోడల్ పరీక్షను సద్వినియోగం చేసుకోండి

- యువ న్యాయవాదులకు ఐఏఎల్ పిలుపు

విశాలాంధ్ర-కడప రూరల్: ఈనెల 5న కడప జిల్లా కోర్టులో గల కడప బార్ అసోసియేషన్ హాలులో భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) జరపతల పెట్టిన జూనియర్ సివిల్ జడ్జ్ మాడల్ పరీక్షను యువ న్యాయవాదులందరూ వ్రాసి సద్వినియోగం చేసుకోవాలని భారత న్యాయవాదుల సంఘం కడప అన్నమయ్య ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు సి. సుబ్రహ్మణ్యం వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి విజయ మారుతి రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బసవతారకం లా కాలేజీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత న్యాయవాదుల సంఘం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను ఒకే రోజు ఈనెల 5న నిర్వహిస్తోందని, ఈనెల 16న జరగబోతున్న జూనియర్ సివిల్ జడ్జ్ పరీక్షకు హాజరుకాబోతున్న యువ న్యాయవాదులు అందరికీ కూడా ఈ మోడల్ టెస్ట్ చాలా ఉపయోగకరంగా ఉంటుందని వారన్నారు. కడప జిల్లా కేంద్రంలోని కడప బార్ అసోసియేషన్ హాలులో ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు ఈ మోడల్ పరీక్ష ను నిర్వహిస్తామని వారు తెలియజేశారు. మోడల్ పేపర్‌ను ఐఏఎల్‌కు చెందిన రిటైర్డ్ జడ్జిలు, సీనియర్ న్యాయవాదులు తయారు చేశారని న్యాయమూర్తుల నోటిఫికేషన్ వచ్చినప్పుడల్లా ప్రతిసారి మోడల్ పరీక్షను ఐఏఎల్ నిర్వహిస్తోందని వారన్నారు. మోడల్ పరీక్షకు హాజరు కాదల్చుకున్నవారు 7013740055, 9963328876 ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి ఈనెల 4న సాయంత్రం లోపు పేరు నమోదు చేయించుకోవాలని వారు కోరారు.

వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

- రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్
- అట్టహాసంగా కాఫీ ల్యాండ్ కేఫ్ ప్రారంభోత్సవం

విశాలాంధ్ర - రాజంపేట: వ్యాపార రంగంలో రాణించాలంటే ముందుగా వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అనిత దీప్తి, జనసేన పార్లమెంట్ సమన్వయకర్త,అతికారి కృష్ణ, పార్లమెంట్ ఇంచార్జ్ ఎల్లటూరి శ్రీనివాసరాజు, నియోజకవర్గ సమన్వయకర్త అతికారి దినేష్ అన్నారు. గురువారం రాజంపేట మండల కేంద్రంలోని బోయిన పల్లెలో కోరముట్ల హరి నూతనంగా నిర్మించిన కాఫీ ల్యాండ్ కేఫ్ కేంద్రాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో కాఫీకి ప్రాధాన్యత పెరిగిందన్నారు. వినియోగదారులకు నాణ్యతమైన కాఫీ అందించినప్పుడే మంచి పేరు ప్రతిష్టలు వస్తాయన్నారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారందరికీ పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలవాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు కీర్తి తెచ్చిన జిల్లా రచయితల సంఘం

- ఆచార్య పుత్త పద్మ, కుల సచివులు, వైవియు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఉగాది పురస్కారాలకు వైయస్సార్ జిల్లా రచయితల సంఘము నుండి ముగ్గురు ఎంపిక కావడం అభినందనీయమని, ఇది మన జిల్లాకు గర్వకార ణమని వైవియు కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ అన్నారు. గురువారం సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో వైయస్సార్ జిల్లా రచయితల సంఘం వారు నిర్వహించిన సత్కార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మ మాట్లాడుతూ సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం గార్లు వారు చేసిన సాహిత్య కృషికి ఉగాది పురస్కారాలు లభించడం ఎంతో హర్షనీయమన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన మైనారిటీ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య ప్రసంగిస్తూ సంఘములో ముగ్గురు సమర్థులైన సాహిత్యకారులకు పురస్కారాలు లభించడం శుభపరిణామమని ఈ సందర్భంగా సంఘానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ వేలాది సాహిత్య సభలు నిర్వహించిన జింకా సుబ్రహ్మణ్యం, గానుగ పెంట హనుమంతరావులకు. అనేక గ్రంథాలు రచించిన డాక్టర్ చింతకుంట శివారెడ్డికి ఉగాది పురస్కారాలు లభించడం మా సంఘానికి గర్వకారణం అన్నారు. సత్కార గ్రహీతలు ఈ సన్మానాన్ని మహద్భాగ్యంగా భావిస్తున్నామని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి డాక్టర్ కే రెడ్డి శేఖర్ రెడ్డి, కార్యదర్శులు భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ పొదిలి నాగరాజు, సభ్యులు డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, హరి భూషణ్ రావు, రామ్మోహన్ రెడ్డి, ముడియం కిషోర్, రామాంజనేయులు, మధు, భారవి తదితరులు ప్రసంగించారు.

నిర్దేశించిన లక్ష్యాలు చేరకుంటే సిబ్బంది ఇంటికే

డ్వామా పిడి వెంకటరత్నం

విశాలాంధ్ర - రామసముద్రం: ఉపాధి హామీ పథకంలో సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరకుంటే ఇంటికి వెళ్లాల్సిందేనని అన్నమయ్య జిల్లా డ్వామా పీడీ వెంకటరత్నం హెచ్చరించారు గురువారం ఆయన రామసము ద్రం మండలంలో విస్తృతంగా పర్యటించారు నారి గాని పల్లి పంచాయతీలో ఉద్యాన పంటలు పరిశీలించారు రోజా పూల మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు రైతులతో మాట్లాడి ఎలాంటి లాభాలు వస్తున్నాయో అడిగి తెలుసుకున్నారు అలాగే కూలీలతో ముఖాముఖిగా మాట్లా డారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో పెద్ద ఎత్తున మినీ గోకులాలు సిమెంట్ రోడ్లు ఉద్యాన పంటలు లక్ష్యాలను నిర్దేశించుకునిందని చెప్పారు సిబ్బంది నిర్లక్ష్యం వీడి కూలీల సంఖ్య పెంచాలని చెప్పారు కార్యక్రమంలో ఏపీవో మాధవి ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

చర్మకారుల కుటుంబాలకు జీవన ఉపాధి

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం: డివిజన్ పరిధిలో ఉన్న చర్మకారుల కుటుంబాలకు జీవన ఉపాధిని కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా చర్మకారుల కుటుంబాలను గుర్తించి వారి జీవన ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక టీమును ఏర్పాటును చేయడంతో అందులో భాగంగానే బద్వేల్ మండల పరిధిలోని చెన్నంపల్లి బ్రహ్మంగారిమఠం బి కోడూరు బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గోపవరం మట్టుకువారిపల్లె గ్రామాలలో పర్యటించి అనంతరం సాంఘిక సంక్షేమ వసతి గృహాలను పరిశీలన చేశారు అందులో భాగంగానే బి కోడూరు మండలం పరిధిలో ఉన్న అంబేద్కర్ గురుకుల కళాశాల బ్రహ్మంగారిమఠం అంబేద్కర్ గురుకులం కళాశాల స్టేట్ ఐ ఏ,ఎస్ అధికారులు ప్రసన్న వెంకటేష్ బద్వేల్ డివిజన్ అధికారి ఆర్డిఓ, చంద్రమోహన్ కలసి పరిశీలన చేశారు ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో విద్యార్థుల మౌలిక సదుపాయాలు వారి వసతులపై అడిగి తెలుసుకుని ప్రభుత్వం నుండి వచ్చే విద్యార్థులకు చేరుతున్నాయా లేవా దానిపై ఆరా తీసి ప్రభుత్వ మెనూ అధికారులు పాటిస్తున్నారా లేదా అని విద్యార్థులతో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారిమఠం, డిప్యూటీ తాహశీల్దార్ జాన్సన్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్, రామసుబ్బయ్య, అధ్యాపకులు పద్మనాభమూర్తి, బసిరెడ్డి, గుర్రత్నం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు

- ఏప్రిల్ 26, 27, 28న జయప్రదం చేయండి

- కరపత్రాల ఆవిష్కరణలో గాలి చంద్ర సిపిఐ జిల్లా కార్యదర్శి

విశాలాంధ్ర-కడప రూరల్: గురువారం అఖిలభారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కడప నగరంలోని హెూచిమెన్ భవన్ లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రం ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హాజరై వారు మాట్లాడుతూ ఇవాళ దేశంలో విద్యారంగం సంక్షోభంలో ఉన్నదని శాస్త్రీయత లోపించి అశాస్త్రీయ భావాలతో విద్యార్థుల మెదడులో విచ్ఛిన్నమయ్యే విధంగా విద్యావ్యవస్థను దేశ పాలకులు కాషాయీకరణతో ప్రేరేపిస్తున్నారని అన్నారు అందులో భాగంగానే యూనివర్సిటీల స్వయం పత్తిపత్తిని కాపాడే అటానమస్ బాడీ అయినా యూజీసీ నూతన ముసాయిదానం తీసుకొని రావడం రాజ్యాంగ విరుద్ధంగా వీసీ నియామకాలు చేపట్టే కార్యక్రమం చేయడం, విద్యార్థి హక్కులు కాల రాయడం, మొత్తంగా కేంద్రీకృతం చేసి కాషాయీకరణ విష బీజాలు విద్యార్థుల మెదడులను ప్రేరేపిస్తున్న పాఠ్యాంశాలుగా బోధిస్తున్న రోజులు మనం చూస్తున్నాం కాబట్టి వెంటనే విద్యార్థి హక్కులు కాపాడాలి శాస్త్రీయ విజ్ఞానం అందించాలి. ఒక శాస్త్రీయమైన ఆలోచనతో అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ మూడు రోజులపాటు జరిగే శిక్షణ తరగతుల్లో వివిధ రంగాల్లో ఉన్నటువంటి ప్రొఫెసర్ల చేత మేధావుల తో రాజకీయ అభ్యున్నత విద్యారంగా సామాజిక వైద్య రంగ అంశాలకు సంబంధించి శిక్షణ పొంది శాస్త్రీయమైన ఆలోచనతో విద్యారంగ సమస్యల పైన భవిష్యత్తు కార్యాచరణతో పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు, ఈ రాష్ట్ర స్థాయి క్లాసులకు రాష్ట్ర నలుమూలల నుండి విద్యార్థి నాయకులు పాల్గొంటారు కాబట్టి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి వలరాజు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు కడప జిల్లా అధ్యక్షులు కే శివశంకర్ నగర అధ్యక్షులు అకిరానాంద్, నికిత, చక్రధర్, రాజేష్, లీలా కృష్ణ, పీటర్, వాసు, అశోక్, మస్తాన్, షరీఫ్, యూనివర్సిటీ నాయకులు మధు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఎంపీడీవో

విశాలాంధ్ర- ఒంటిమిట్ట: ఒంటిమిట్ట మండలం, నర్వకాటిపల్లి గ్రామ సచివాలయంను గురువారం ఎంపీడీవో కులాయి బాబుసందర్శించడం జరిగింది. సచివాలయ సిబ్బందికి సూచనలు సలహాలు ఇస్తూ త్వరగా సర్వేలు పూర్తి చేయాలని మరియు పారిశుధ్యం తదితర అంశాలపై మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయిత కార్యదర్శి సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అటవీశాఖ ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకోవాలి

- ఎన్‌బిడబ్ల్యుఎల్‌కు ఎంపీ అవినాష్‌రెడ్డి వినతి

విశాలాంధ్ర-పులివెందుల: వైఎస్సార్ కడప జిల్లా కాశిరెడ్డిరెడ్డి మండలంలోని జ్యోతిక్షేత్రంలో కాశినాయన ఆశ్రమ అభివృద్ధి కోసం నేషనల్ బోర్డ్‌ఫర్ వైల్డ్‌లైఫ్ స్టాండింగ్ కమిటీ నుంచి అటవీశాఖ ఆమోం తెలిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వినపత్రం అందజేశారు. ఆ మేరకు ఢిల్లీలో నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్ లైఫ్ మెంబర్ సెక్రటరీ, సత్య ప్రకాష్ యాదవ్‌ను గురువారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతిక్షేత్రం అభివృద్ధి తదితర అంశాలను సత్యప్రకాష్‌కు వివరించినట్లు తెలిసింది.

వైవీయూ క్యాంపస్ డ్రైవ్‌కు విస్తృత స్పందన

విశాలాంధ్ర-కడప వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ కు విస్తృత స్పందన లభించింది. ప్రముఖ బయోకాన్ మల్టీ నేషనల్ కంపెనీ వైవియులో చేపట్టిన ఎంపికలకు తిరుపతి, వైజాగ్, గుంటూరు రాజమండ్రి బాపట్ల రాయచోటి కడప జిల్లాల నుంచే కాక చతిస్గడ్, ఒడిస్సా తమిళనాడు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి 500 మంది ఇంజనీరింగ్, డిగ్రీ పీజీ అర్హత గల అభ్యర్థులు హాజరయ్యారు. వైవియు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ రఘునాథ్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ క్యాంపస్ డ్రైవ్ ప్రారంభించి మాట్లాడుతూ ప్రముఖ బయోకాన్ కంపెనీ విశ్వవిద్యాలయం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయ ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి విజయ భారతి ఎంపికల ప్రక్రియను సమన్వయం చేశారు. బయోకాన్ కంపెనీ క్వాలిటీ అస్సూరెన్స్ మేనేజర్ లక్ష్మీనరసయ్య, హెచ్‌ఆర్ విబాగా డిప్యూటీ మేనేజర్ జయప్రకాష్, ఎస్సార్ డైరెక్టర్ జయభారత్, ఆపరేషన్ హెడ్ ఎన్ హెచ్ అశోక్, క్లస్టర్ హెడ్ రాజశేఖర్, హెచ్ ఆర్ విభాగ ఆర్ శరత్ విద్యార్థులకు మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఇందులో 160మంది అభ్యర్థులను కంపెనీ ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్, ఇంజనీరింగ్ అండ్ మెయింటెనెన్స్ విభాగాలలో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు ప్రొఫెసర్ చంద్రమతి శంకర్, ప్లేస్మెంట్ సెల్లు ప్రతినిధులు డాక్టర్ లలిత, డాక్టర్ గణేష్ నాయక్, డాక్టర్ సుభోస్ చంద్ర, అధ్యాపక, బోధనేతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

దాహం తీర్చడానికే డొక్కా సీతమ్మ చలివేంద్రం ఏర్పాటు

- ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ అద్వర్యంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర పర్యవేక్షణలో మహతల్లి అన్నదాత డొక్కా సీతమ్మ పేరుతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కడప కుడ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం టోల్ గేట్ వద్ద ఉన్న ఇంద్ర బస్సు షెల్టర్ లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కారుమంచి సంయుక్త, తెలుగుదేశం పార్టీ నాయకులు పోతురాజు నవీన్ కుమార్, నార్జాల హేమరాజ్, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, సింగమాల మల్లిఖార్జున రెడ్డి, పిఎస్ వేణు, జనసేనపార్టీ సీనియర్ నాయకులు జోగినేని మణి, పిసిఎన్ బ్రదర్స్ పగడాల వెంకటేష్, చంద్రశేఖర్, తిమ్మిశెట్టిపల్లి మణి (కొడిమణి), నాగోలు అమర్ నాథ్, ముత్యాల కిషోర్ కుమార్, దాసరి వీరేంద్ర, గునిపాటి చెన్నరాయుడు, యామల సిద్దేశ్వర తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర - సంబేపల్లె: మలేరియా నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా మలేరియా అధికారి ఆర్.రామచంద్రారెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు గురువారం సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రౌతుకుంట గ్రామంలో జరుగుతున్న మలాథియాన్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రభుత్వం గ్రామంలో దోమల నివారణ కొరకు మలాథియాన్ స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మలేరియా అధికారి మాట్లాడుతూ ప్రతి ఇంటికి స్ప్రేయింగ్ తప్పక చేయించుకోవాలని సూచించారు. వేసవి కాలం కావడంతో ఆరుబయట నిద్రిస్తుంటారని దోమల నివారణకు దోమతెరలు వాడాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేడ దిబ్బలు గృహాలకు దూరంగా వేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే ని తప్పక పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్ యూనిట్ అధికారి జయరామయ్య, సిహెచ్ఓ రాణి, సదాశివరెడ్డి, రవిశంకర్, ల్యాబ్ టెక్నీషియన్ శివ, ఎంఎల్ హెచ్ పి సాయిలీల, ఏఎన్ఎం అమరావతి, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌తో కలిసి ఆటోనగర్ ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర- మదనపల్లె: మదనపల్లె గ్రామీణ మండలం, వలసపల్లి పంచాయతీలో గత 15 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న ఆటోనగర్ ప్రాంతాన్ని గురువారం ఎమ్మెల్యే షాజహాన్ భాష ఏపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తితో కలిసి పరిశీలించారు. గత 15 ఏళ్ల క్రితం ఆటోనగర్ కు రైతులు తమ భూములు ఇచ్చారు. అయితే వారికి నష్టపరిహారం అందక పోవడంతో కోర్టులో కేసులు నడుస్తున్నాయి. ఈ కారణంగా ఆటోనగర్ ని అభివృద్ధి చేయలేకపోవడం బాధాకరమని ఎమ్మెల్యే అన్నారు. వీలైనంత త్వరలో ఆటోనగర్ కోర్టు విషయాలను పరిష్కరించి, సంబంధిత రైతులతో ఒప్పించి ఆటోనగర్ ప్రాంతంలో నెలకొన్న ఇబ్బందులను తొలగించి, అభివృద్ధి చేసేం దుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు రమణయ్య నాయుడు, సీతక్క యుగంధర్, గురు మంచూరు, సురేందర్ రెడ్డి, పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.